ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శనివారం 19 ఏప్రిల్ 2025



వేటగాళ్ల ఉచ్చుకు బలైన చిరుత (ఫైల్)

మదనపల్లె మండలం పొన్నేటిపాళెం వద్ద వేటగాళ్ల ఉచ్చుకు చిక్కిన చిరుత, దాని కడుపులోని రెండు పిల్లలు మృతి చెందడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించిన విషయం తెలిసిందే. స్వయంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ స్పందించి ఈ సంఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరపమని అటవీ అధికారులను ఆదేశించారు. ఈ సంఘటనతో జిల్లాలో జరుగుతున్న వన్యప్రాణుల వేటపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. జిల్లాలో ఎన్నో ఏళ్లుగా అడవి పందులు, జింకలు, కుందేళ్లతో పాటు ఇంకా పలు అడవి జంతువుల వేట సాగుతోంది. ఇందులో ఎక్కువగా అటవీ సమీప ప్రాంత గ్రామాలలోని వేటగాళ్లు వేటకు వెళతారనే ప్రచారం ఉంది. ఎక్కువగా అడవి పందుల కోసం వేటాడుతున్నారు. వేటకు కొందరు నాటు తుపాకులు ఉపయోగిస్తుండగా ఇంకా కొందరు ఇనుప తీగలతో ఉచ్చులు వేయడం, విద్యుత్ కనెక్షన్లు తీయడం, నాటు బాంబులు వాడుతున్నారు. అయితే ఈ వేటలో అడవి పందులకు బదులుగా ఇతర జంతువులు సైతం వేటగాళ్ల ఉచ్చుకు చిక్కుతున్నాయి. కొన్నిచోట్ల సామాన్య జనం సైతం మృత్యువాత పడుతున్నారు

జోరుగా వన్యప్రాణుల వేట..!

- తాజాగా చిరుత మృతితో వెలుగులోకి .. బయట పడనివి ఎన్నో?
- లెక్కకు మించి అడవి పందులు, జింకల వేట
- అటవీ సమీప ప్రాంతాల్లోనే వేటగాళ్లు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాయచోటి, రాజంపేట, పీలేరు, తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల పరిధిలో పెద్ద కొండలు, గుట్టలు, దట్టమైన అటవీ ప్రాంతం ఉంది. ఈ అడవుల్లో ఎక్కువగా జింకలు, దుప్పిలు, అడవి పందులతో పాటు ఇంకా అనేక జంతువులు ఉన్నాయి. ఇటీవల కాలంలో ఈ ప్రాంతంలో చిరుతల సంచారం కూడా ఎక్కువైంది. ఈ ఏడాది ఆశించినంత మేర వర్షాలు పడకపోవడంతో జంతువులు తాగునీటి కోసం అటవీ సమీపంలో ఉన్న కుంటలు, బావుల వద్దకు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే మదనపల్లె మండలంలో చిరుత వేటగాళ్ల ఉచ్చుకు చిక్కుకుంది. ఎక్కువగా రాయచోటి, రామాపురం, వీరబల్లి, సుండుపల్లె, రాజంపేట, గుర్రంకొండ, కలకడ, బి.కొత్తకోట, పీటీఎం, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, చిట్వేలితో పాటు ఇంకా కొన్ని మండలాల్లో అటవీ సమీప ప్రాంతాల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున వేటకు వెళతారని సమాచారం అటవీ అధికారులకు సైతం తెలుసు. అయితే ఈ వేటను అరికట్టేందుకు సరైన చర్యలు తీసుకోకపోవడంతో తొలిసారిగా మదనపల్లె మండలంలో ఓ చిరుత వేటగాళ్ల ఉచ్చుకు చిక్కుకుని మృతి చెందింది. గతంలో ఇలా వేటగాళ్ల వల్ల మనుషులు ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు ఉన్నాయి.

గత ఏడాది డిసెంబరు 22వ తేదీ రాయచోటి మండలం మాధవరం గ్రామంలో అడవి పందుల కోసం వెళ్లిన వేటగాళ్లు నాటు తుపాకీతో జరిపిన కాల్పుల్లో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. అటవీ ప్రాంతంలోకి రెండు గుంపులుగా వేర్వేరుగా వేటగాళ్లు వెళ్లి అర్ధరాత్రి సమయంలో చెట్లలో అలికిడి కావడంతో అడవిపందులు అనుకుని కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో హనుమంతు అనే వ్యక్తి మృతి చెందగా.. రమణ తీవ్రంగా గాయపడ్డాడు. అడవి పందుల కోసం ఓ వేటగాళ్ల గుంపు అడవిలోకి వెళ్లి అడవిపందులు సంచరిస్తాయనే అనుకున్న స్థలంలో తినే పదార్థాలలో నాటుబాంబులు అమర్చారు. అవి తిన్న వెంటనే నాటుబాంబులు పేలి చనిపోయి ఉంటాయని అక్కడికి వెళ్లి చెట్లలో వెతుకుతుండగా.. మరో గుంపు వేటగాళ్లు అడవి పందులనుకుని కాల్పులు జరిపారు. ఈ సంఘటన అప్పట్లో తీవ్ర సంచలనం కలిగించింది.

2024 జనవరిలో మదనపల్లె మండలం మాలెపాడు పంచాయతీ ఆవులపల్లె సమీపంలోని నల్లరాజుగారిపల్లెకు చెందిన సిద్దప్ప భార్య పాపులమ్మ అడవికి గడ్డి కోసమని వెళ్లింది. అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు వేట కోసం అడవికి వెళ్లారు. ఏపుగా పెరిగిన గడ్డిలో ఉన్న పాపులమ్మను గుర్తించని వీళ్లు.. గడ్డి కదులుతూ ఉండడంతో.. కుందేలనుకుని తమ వద్ద ఉన్న నాటుతుపాకీతో కాల్పులు జరిపారు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన బాధితురాలు సుమారు నెల రోజుల పాటు తిరుపతిలో చికిత్స పొంది ప్రాణాలతో బయటపడింది. గతంలో ఇదే మండలంలోని టేకులపాలెం వద్ద అడవి పందుల కోసం కరెంటు తీగలతో ఉచ్చులు వేసిన కృష్ణమూర్తి అవే ఉచ్చులు కాలుకు తగులుకుని చనిపోయాడు. గతంలో గుర్రంకొండ మండలంలో కొందరు అడవి పందుల కోసం తీసిన విద్యుత్ వైర్లకు తగులుకుని ఓ వ్యక్తి కూడా మృతి చెందాడు. ఇలా వేటగాళ్లు ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లను గమనించకుండా పొలాలకు వెళ్లిన రైతులు మృత్యువాత పడిన సంఘటనలు జిల్లాలో ఉన్నాయి. చిరుత మృతి చెందిన సంఘటనతో అయినా అటవీ అధికారులు, పోలీసులు వన్యప్రాణుల వేట అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.



చిరుత కడుపులోనే మృతి చెందిన కూనలు (ఫైల్)



వేటగాళ్ల కాల్పుల్లో మృతి చెందిన హనుమంతు (ఫైల్), చికిత్స పొందుతున్న రమణ (ఫైల్)

చిరుత మృతిపై ప్రభుత్వం సీరియస్

చిరుత మృతి చెందిన ప్రదేశాన్ని పరిశీలించిన పీసీసీఎఫ్



డీఎఫ్‌వో, సబ్‌డీఎఫ్‌వోతో చర్చిస్తున్న పీసీసీఎఫ్ చలపతిరావు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం పొన్నేటిపాళెం గ్రామం వద్ద చిరుత మృతిచెందడాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చలపతి రావు పేర్కొన్నారు. చిరుత మృతిచెందిన ప్రదేశాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చిరుత తిరుగాడిన ప్రదేశం, చుట్టుపక్కల చిట్టడవి, నీటికుంటల చుట్టూ అడవి జంతువుల పాద ముద్రలను ఆయన పరిశీలించారు. వేటగాళ్ల ఉచ్చులో చిరుత ఎన్ని గంటలకు చిక్కుకుని ఉండవచ్చు, ఎంత సేపు బందీగా ఉండిపోయింది తదితర విషయాలను సబ్ డీఎఫ్‌వోను అడిగి తెలుసుకున్నారు. అలాగే చిరుతను రక్షించడానికి తీసుకున్న చర్యలపై ఆరా తీశారు.

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వేటగాళ్లు కావాలనే చిరుతను బంధించేందుకు పకడ్బందీగా జీవి తీగలతో ఉచ్చులు బిగించారన్నారు. అడవి పందులు, కణుతులు, దుప్పులు తిరిగే చోటు కాకుండా వేరేచోట ఉచ్చు బిగించారన్నారు. వన్యప్రాణుల వేటపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. మదనపల్లె వంటి ప్రాంతాల్లో వన్యప్రాణులను రక్షించేందుకు అవసరమైన ట్రాంకిలైజర్స్ పరికరాలు అందుబాటులో ఉంచేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తామన్నారు. ఆయన వెంట కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సెల్వం, డీఎఫ్‌వో జగన్నాథసింగ్, సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసులు, ఎఫ్ఆర్‌వో జయప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పీసీసీఎఫ్‌ను అడ్డుకునేందుకు గ్రామస్థుల యత్నం

చిరుత మృతిచెందిన ప్రదేశాన్ని పరిశీలించి వెనుతిరిగిన పీసీసీఎఫ్ చలపతిరావును అడ్డుకునేందుకు పొన్నేటిపాళెం గ్రామస్థులు యత్నించారు. చిరుత మృతిచెందిన కేసులో అటవీశాఖ అధికారులు ఏడుగురిపై కేసు నమోదు చేసి ముగ్గురిని అరెస్టు చేసి రిమాండుకు తరలించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మిగిలిన నలుగురు కోసం పోలీసుల సహాయంతో అటవీశాఖ అధికారులు వస్తున్నారని గ్రామస్థులందరు ఏకమయ్యారు. దీంతో ముగ్గురు సీఐలు, ఎస్ఐలు, సిబ్బందితో పొన్నేటిపాళెం గ్రామానికి చేరుకుని నిందితుల కోసం ఆరా తీశారు. ఈ క్రమంలో పీసీసీఎఫ్ చలపతి రావు పొన్నేటిపాళెం గ్రామం మీదుగా మదనపల్లెకు వస్తుండగా, కొంతమంది ఆయన కాన్వాయ్‌కు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఏదైనా సమస్య ఉంటే లిఖిత పూర్వకంగా పీసీసీఎఫ్‌కు ఫిర్యాదు చేయాని పోలీసులు సర్ది చెప్పి అక్కడి నుంచి మదనపల్లె కార్యాలయానికి చేరుకున్నారు.

అధికారులు, గ్రామస్థులతో అంతర్గత విచారణ

మదనపల్లె అటవీశాఖ రేంజర్ కార్యాలయానికి చేరుకున్న పీసీసీఎఫ్ చలపతిరావు అంతర్గతంగా ప్రతి అధికారిని విచారించారు. ఎఫ్ఆర్‌వో జయప్రసాదరావు, డీఆర్‌వో మదనమోహన్, ఎఫ్‌బీవో ఉమాదేవి, ఇతర సిబ్బందిని విడివిడిగా విచారించారు. చిరుత చిక్కుకున్నప్పటి నుంచి ఏమేమి చర్యలు తీసుకున్నారు. ఏ సమయానికి సంఘటన స్థలానికి చేరుకున్నారు..

తదితర విషయాలపై ఆరా తీశారు. పొన్నేటిపాళెంకు చెందిన ఆరుగురు రైతులను పిలిచి చిరుత మృతి ఘటనపై విచారించారు. ఉచ్చు ఎవరు బిగించారు, ఎందుకు ఇలా జరిగింది అని ప్రశ్నించారు. గ్రామస్థులు ఇచ్చిన అర్జీలు తీసుకుని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఆయన హార్సిలీహిల్స్‌కు వెళ్లిపోయారు.

గవర్నర్ బంగ్లా సమీపంలోని స్విమ్మింగ్‌పూల్‌లో సేదతీరుతున్న చిన్నారులు, మహిళలు



హార్సిలీహిల్స్‌లో సందడే..సందడి..

- ప్రకృతి అందాలలో సేదతీరిన పర్యాటకులు
- చిరుజల్లులతో కొండపై ఆహ్లాదకర వాతావరణం

బి.కొత్తకోట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్ చాలా కాలం తర్వాత పర్యాటకులతో కళకళలాడింది. ఇటీవలి కాలంలో విద్యార్థులకు వివిధ పరీక్షలు ఉండటం, కొండ దిగువ భాగంలో చెక్‌పోస్టును పెట్టి తనిఖీల పేరుతో కట్టడి చేయడంతో పర్యాటకుల సంఖ్య బాగా తగ్గిపోయింది. పరీక్షలు పూర్తి కావడంతో పాటు తనిఖీలకు తాత్కాలిక బ్రేక్ పడటంతో పర్యాటకుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. శుక్రవారం గుడ్ ఫ్రైడే సెలవు కావడంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో పర్యాటకులు హిల్స్‌కు చేరుకుని సందడి చేశారు. సముద్రమట్టానికి 4312 అడుగుల ఎత్తులో ఉండే హార్సిలీహిల్స్‌పై సహజంగానే చల్లటి, ఆహ్లాదకరమైన వాతారణం ఉంటుంది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి మేఘావృతమై చిరుజల్లులు కూడా కురవడంతో ఒక్కసారిగా వాతావరణం మారిపోయి చలికాలాన్ని తలపించింది. ఆ వాతావరణంలో గాలిబండ, పాత, కొత్త వ్యూపాయింట్ల నుంచి ప్రకృతి అందాలను తిలకిస్తూ, పర్యాటకులు కేరింతలు కొడుతూ ఎంజాయ్ చేశారు. ఫారెస్ట్ క్యాంపస్, ఘాట్ రోడ్డు మలుపులలో ఫొటోషూట్‌లు, వీడియోలతో జనం సందడి చేశారు.



హార్సిలీహిల్స్‌లోని గాలిబండపై పర్యాటకుల సందడి

రైతులను ముంచిన పెనుగాలులు

- 200 ఎకరాల్లో కుప్పకూలిన అరటిచెట్లు
- రూ.3 కోట్లకు పైగా నష్టం



రాజంపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలంలోని మూడు గ్రామ పంచాయతీల్లో శుక్రవారం వీచిన పెనుగాలులకు 200 ఎకరాల్లో అరటి పంట దెబ్బతిని రూ.3 కోట్లకు పైగా నష్టం వాటిల్లింది. మండలంలోని కొల్లావారిపల్లె, శవనవారిపల్లె పంచాయతీ పరిధుల్లో పెద్దఎత్తున పెనుగాలులు వీయడంతో అరటి చెట్లు కుప్పకూలిపోయాయి. ఆరుగాలం కష్టించి పండించిన అరటి పంట చేతికొచ్చే సమయంలో ఒక్కసారిగా గాలులతో భారీ నష్టం వాటిల్లింది. 200 ఎకరాల్లో పంట దెబ్బతినడం వల్ల రూ.3 కోట్ల వరకు రైతులు నష్టాల పాలైనట్లు ప్రాథమిక అంచనాలను బట్టి తెలుస్తోంది. మిట్టమీదపల్లె గ్రామ రైతు, రాజంపేట మండల టీడీపీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు మాట్లాడుతూ శుక్రవారం భారీగా వీచిన పెనుగాలుల రైతులు భారీగా నష్టపోయారన్నారు. శనివారం అధికారులతో కలిసి తెలుగుదేశం పార్టీలోని ప్రధాన నాయకులు నష్టపోయిన రైతులను పరామర్శించి వారిని అన్నివిధాలుగా ఆదుకుంటామని తెలిపారు.

ముత్యాల తలంబ్రాలు తిరుపతికి తరలింపు



7

- మండల అధికారులకూ అందని వైనం.. భక్తుల అసంతృప్తి

చిరుత మృతికి అధికారులే కారణం

- రైతులపై అక్రమ కేసులు ఎత్తేయాలని గ్రామస్థుల ధర్నా

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పొన్నేటిపాళెం గ్రామం వద్ద ఉచ్చులో చిక్కుకున్న చిరుత మృతికి అటవీ శాఖాధికారులే కారణమని, రైతులు కాదని గ్రామస్థులు ఆరోపించారు. శుక్రవారం స్థానిక ఎఫ్ఆర్‌వో కార్యాలయం గేటు ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచ్చులు వేసిన వారిని వదిలేసి, చిరుత గురించి సమాచారం ఇచ్చిన వారిని అరెస్టు చేయడం దారుణమన్నారు. అధికారుల తప్పులను కప్పిపుచ్చుకోవడానికి రైతులపై అక్రమ కేసులు పెట్టి తమ కుటుంబ పెద్దలను అరెస్టు చేశారన్నారు. కేవలం విచారణకు పిలుస్తున్నామని చెప్పి నోటీసులు ఇవ్వకుండా చట్టవ్యతిరేకంగా అరెస్టు చేశారన్నారు. దీనికి అధికారులు సమాధానం చెప్పేంత వరకు ధర్నా విరమించమని మొండిపట్టుపట్టారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ ఎస్ఐ అన్సర్‌బాషా అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు సర్దిచెప్పారు. ప్రభుత్వ కార్యాలయం ఎదుట అనుమతి లేకుండా ధర్నాలు చేస్తే కేసులు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రావణి, సురేంద్ర, మనోహర్‌తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.



ఎఫ్ఆర్‌వో కార్యాలయం గేటు వద్ద బైఠాయించిన గ్రామస్థులు

ఏడుగురిపై కేసు నమోదు

- ముగ్గురికి రిమాండ్, నలుగురి కోసం గాలింపు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలో చిరుత మృతి ఘటనపై అటవీ శాఖాధికారులు ఏడుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పొన్నేటిపాళెం గ్రామానికి చెందిన కె.రెడ్డెప్పరెడ్డి, డి.గంగాధర్, కె.వెంకటరమణారెడ్డిని ఇది వరకే అరెస్టు చేసి రిమాండుకు పంపిన విషయం తెలిసిందే. మిగిలిన వారిలో ఎం.మోహన్‌రెడ్డి, కె.ఎం.మోహన్‌రెడ్డి, కె.చిన్నపరెడ్డి, ఎం.నవీన్‌రెడ్డి నిందితులుగా ఉన్నారు. వీరిని అరెస్టు చేసేందుకు అటవీశాఖ అధికారులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

రిజిస్ట్రేషన్లలో చేతివాటం

- రైటర్స్ ఇంటికి వెళ్లి మరీ వసూళ్లు
- రాయచోటి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తీరు...

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రాయచోటి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వసూళ్ల దందా నడుస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. అయిన వారికి కంచంలోనూ కాని వారికి చేతుల్లో వడ్డించినట్లు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ వ్యవహరిస్తున్నారని డాక్యుమెంట్ రైటర్లు ఆరోపిస్తున్నారు. గతంలో ఉన్న రాయచోటి సబ్ రిజిస్ట్రార్ దాదాపు 5 నెలల క్రితం సస్పెండ్ అయిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి రాయచోటి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సీనియర్ అసిస్టెంట్‌ను ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా పైఅధికారులు నియమించారు. ఇదే అదునుగా చేసుకుని ఆయన రేటు పెట్టి మరీ వసూళ్లకు పాల్పడుతున్నాడని ఆరోపణలు ఉన్నాయి. కడపలో ఉన్న ఆస్తికి ఇక్కడ రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు డాక్యుమెంట్ రైటర్ దగ్గర నుంచి దాదాపు రూ.90 వేలు ఇంటికి వెళ్లి తీసుకున్నారని సమాచారం. అంతేగాకుండా రాయచోటి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న గ్రామ కంఠాలకు రూ.7 వేలు, గ్రామాల్లో ఉన్న వాటికి రూ.5 వేలు వసూలు చేస్తున్నారని కొంతమంది డాక్యుమెంట్ రైటర్లు చెబుతున్నారు. శిబ్యాల గ్రామానికి చెందిన ఆస్తి 649/1సీలో విస్తీర్ణం 38 సెంట్లపై కోర్టులో కేసు నడుస్తున్నా రిజిస్ట్రేషన్ చేయడానికి పూనుకున్నాడని, ఇందులో కూడా పెద్ద మొత్తంలో ముడుపులు చేతులు మారాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది చెప్పిందే వేదంగా నడుస్తోందని కొంతమంది ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పైస్థాయి అధికారులు రాయచోటి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై దృష్టి పెట్టి ఇక్కడ జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్ట వేసే సబ్ రిజిస్ట్రార్‌ను నియమించాలని రైటర్లు, ప్రజలు కోరుతున్నారు.



రాయచోటి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



కార్యాలయంలో మామూళ్ల పర్వం

రాయచోటి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొంతకాలంగా రెగ్యులర్ సబ్ రిజిస్ట్రార్ లేక సిబ్బంది మామూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈసీ, నకళ్లు తీసుకోవడానికి రెండు రోజులు సమయం పట్టడమే కాకుండా వారు అడిగినంత డబ్బులు ఇవ్వాల్సిందేనని రైటర్లు కొంతమంది చెప్పుకొస్తున్నారు. ఇక్కడ రోజూ 40 నుంచి 60 రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. అయితే ఒక్కొక్క రిజిస్ట్రేషన్‌కు వ్యాల్యూను బట్టి 1 పర్సెంట్ కమీషన్ ఇవ్వాలని రూల్స్ పెట్టారని వారు చెబుతున్నారు. మ్యారేజ్ సర్టిఫికెట్‌కు రూ.500 నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే మేము డీఆర్ ఆఫీసుకు కూడా మామూళ్లు పంపించాలి కనుక మమ్మల్ని మీరు చూసుకోండి అని డాక్యుమెంట్ రైటర్లతో కార్యాలయ సిబ్బంది అంటున్నారని తెలిసింది. ఇక్కడ ఉన్న డీఆర్ గత జూన్ నెలలో చిత్తూరుకు బదిలీపై వెళ్లిపోవడంతో ఈ జిల్లాకు డీఆర్‌ను అనంతపురం నుంచి ఇన్‌చార్జిగా వేశారు. ఆయన నెలలో రెండుసార్లు మాత్రమే రాయచోటికి వచ్చి అలా కూర్చుని ఇలా వెళ్లిపోతున్నారన్న సిబ్బంది చెబుతున్నారు.

ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ వివరణ

రాయచోటి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతిపై రాయచోటి ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ సునీల్‌ను వివరణ కోరగా విషయాలన్నీ మీకు తెలుసు. ఇలా అడిగితే నేను ఏమి చెప్పాలి అని చెప్పడం విశేషం.

హార్సిలీహిల్స్‌లో చిరుతపులి అడుగుజాడల గుర్తింపు

- వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు
- పీసీసీఎఫ్ చలపతిరావు

బి.కొత్తకోట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): హార్సిలీహిల్స్‌లోని రిజర్వు ఫారెస్ట్‌లో చిరుతపులి సంచరిస్తున్నట్లు గుర్తించామని ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్ చలపతిరావు తెలిపారు. మదనపల్లె రూరల్ పొన్నేటిపాళెం వద్ద వేటగాళ్ల ఉచ్చులో పడి చిరుతపులి మృతిచెందిన ఘటనకు సంబంధించి దర్యాప్తు, పరిశీలన నిమిత్తం గురువారం రాత్రి పొద్దుపోయాక ఆయన హార్సిలీహిల్స్‌కు చేరుకుని అటవీశాఖ అతిథిగృహంలో బస చేశారు. ఉదయం పొన్నేటిపాళెం వద్దకు వెళ్లి పరిశీలించిన అనంతరం మధ్యాహ్నం మళ్లీ హిల్స్‌కు చేరుకున్నారు. అటవీశాఖ సిబ్బందితో కలిసి ఘాట్‌రోడ్డులో ఎప్పుడూ నీరునిల్వ ఉండే గంగోత్రి కొలను, గుంతమీదకుంట, కొన్ని మలుపులను పరిశీలించారు. నీటికోసం చిరుతపులి వచ్చి వెళుతున్న ఆనవాళ్లను, పులి కాలిగోళ్ల గుర్తులను పరిశీలించారు. హిల్స్ రిజర్వు ఫారెస్ట్‌లో చిరుతపులుల సంచారం ఉన్నట్లు ధృవీకరించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో జగన్నాథ్‌సింగ్ సహా సిబ్బందితో వన్యప్రాణుల రక్షణపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హార్సిలీహిల్స్ రిజర్వు ఫారెస్ట్ పరిధిలోను, పరిసరాలలో అర కిలోమీటరు లోపల ఉన్న అన్ని చెరువులు, కుంటలు, నీటి వనరుల వద్ద పులులు, కణితి, దుప్పి లాంటి వన్యప్రాణుల కదలికలపై నిఘా పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. వేటకు ప్రయత్నించే వారిని గుర్తించి వన్యప్రాణి సంరక్షణ చట్టంపై కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. రిజర్వు ఫారెస్ట్‌లో ఎంపిక చేసిన ప్రాంతాలలో త్వరలో ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట చీఫ్ కన్సర్వేటర్ సెల్వం, సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసరావు, సెక్షన్ ఆఫీసర్ శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఆటో డ్రైవరు మృతి


మృతిచెందిన పాలెం రాజు

చెన్నూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక హైవే రహదారిలో రెండు రోజుల కిందట ఆటోను వెనుక వైపు నుంచి వచ్చి లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా ఆటో డ్రైవరు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. అయితే ఈయన కూడా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలిలా.. ఈ నెల 16న నలుగురు ప్రయాణికులతో ఆటో చెన్నూరు నుంచి కడప నగరానికి వెళుతోంది. కాగా మైదుకూరు నుంచి కడపకు వెళుతున్న లారీ వెనుక వైపు నుంచి వచ్చి ఆటోను ఢీకొనగా అందులో ప్రయాణిస్తున్న స్థానిక అరుంధతీనగర్‌కు చెందిన లక్ష్మిగాండ్ల బాలమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనలో మిగిలిన వారికి స్వల్ప గాయలవడంతో పాటు ఆటో డ్రైవరు పాలెం రాజు(26) తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో వారందరినీ రిమ్స్‌కు తరలించారు. కాగా చికిత్స పొందుతూ శుక్రవారం కడప రిమ్స్‌లో డ్రైవర్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు రెండేళ్లలోపు ఇద్దరు చిన్నారులు ఉన్నారు. ఆటో డ్రైవరు మృతి చెందడంతో స్థానిక కొత్త గాంధీనగర్‌లో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

కారు అదుపుతప్పి ఒకరు...


వెంకటసాయి మృతదేహం

సింహాద్రిపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నిడివెలగల గ్రామం వద్ద కారు అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో వెంకటసాయి(28) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... గురువారం రాత్రి 11గంటల సమయంలో సింహాద్రిపురం నుంచి పులివెందుల వైపు బయలుదేరిన ఏపీ16సికె 0005 నెంబరు గల వాహనం నిడివెలగల గ్రామం వద్దకు రాగానే స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ వాహనంలో నలుగురు వ్యక్తులు ప్రయాణిస్తున్నారు. వీరందరూ పులివెందు లకు చెందినవారే. ఈ సంఘటనలో వెంకటసాయి మృతితో పాటు మరో ముగ్గురు మణిదీప్, శివచంద్ర, వేణు అనే వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. వేణు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు. సంఘటనా స్థలాన్ని పులివెందుల సీఐ ఎస్వీ రమణ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పులివెందుల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కారు ఢీకొని టీడీపీ కార్యకర్త...



మృతిచెందిన ఇరగంరెడ్డి

రామాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారిలోని మండల కేంద్రమైన రామాపురం పోలీస్ స్టేషన్ ఎదురుగా శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు స్కూటర్‌ను ఢీకొని టీడీపీ కార్యకర్త పప్పిరెడ్డి ఇరగంరెడ్డి (50) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ వెంకటసుధాకర్ రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు... మండలంలోని హసనాపురం పంచాయతీ గొల్లపల్లికి చెందిన పప్పిరెడ్డి ఇరగంరెడ్డి రామాపురంకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా పోలీస్‌స్టేషన్ సమీపానికి రాగానే కడప నుంచి రాయచోటి వైపు వెళ్తున్న కారు స్కూటర్‌ను ఢీకొంది. ఇరగంరెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని శవపరీక్షకై లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం బంధువులకు అప్పగించారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కారు, మోపెడ్‌ను ఢీకొన్న కంటైనర్

- ఇరువురికి గాయాలు


పెంజి అనంతపురం వద్ద కంటైనర్ మీద పడటంతో నుజ్జయిన కారు

కొండాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంజి అనంతపురం గ్రామం వద్ద శుక్రవారం కారు, మోపెడ్‌ను కంటైనర్ ఢీకొనడంతో ఇరువురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... కడప వైపు నుంచి వెళుతున్న గుజరాత్‌కు చెందిన కంటైనర్ వాహనం, కొండాపురం నుంచి అటువైపు వెళుతున్న టీవీఎస్ మోపెడ్‌ను ఢీకొంది. దీంతో మోపెడ్‌లో వెళ్తున్న పెద్దన్న అనే వ్యక్తి ఎగిరి కింద పడడంతో గాయాలయ్యాయి. అదిచూచి ఇదే వైపు కడప నుంచి తాడిపత్రికి కారులో వెళుతున్న రమణారెడ్డి అనే కారు డ్రైవర్ కంటైనర్‌ను ఆపేందుకు ప్రయత్నించాడు. దీంతో కారును ఓవర్‌టేక్ చేయబోయి కంటైనర్ కారు మీద పడింది. ఈ సంఘటనలో కారు నుజ్జు నుజ్జయి రమణారెడ్డికి గాయాలయ్యాయి. కాగా వారిరువురిని తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి 108 వాహనంలో తరలించారు. సంఘటనా స్థలానికి కొండాపురం ఎస్సై ప్రతాప్‌రెడ్డి, సిబ్బంది చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శరీరమే మరణం.. నేత్రాలు పదిలం

- కళ్లను ఐ బ్యాంకుకు అందజేసిన మిత్రులు


నేత్రాలను దానం చేస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): శరీరంలో జీవం పోయినా.. ఆయన చూపు మాత్రం పదిలంగా ఉండాలని వారు ఆలోచించారు. వచ్చిందే తడవుగా ఆ నేత్రాలను ఇతరులకు ఉపయోగపడేలా ఓ స్వచ్ఛంద సంస్థకు అందజేశారు. వివరాల్లోకెళ్తే.. అన్నమయ్య జిల్లా కలికిరి మండలం కంభంవారిపల్లెకు చెందిన శ్రీనివాసులరెడ్డి మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ప్రభుత్వంలో ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో పనిచేశారు. పలు మార్లు శత్రు దేశాలతో యుద్ధంలో పాల్గొన్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఎయిర్ ఫోర్స్ నుంచి వచ్చిన తరువాత కూడా వివాహం చేసుకోకుండా జిల్లాలోని పీలేరు, రాయచోటి నియోజకవర్గాల్లో పలు విద్యాసంస్థల ఆరంభంలో కీలకపాత్ర పోషించారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే అమ్మఒడి (అనాథ పిల్లల సంక్షేమ సంస్థ) ఉమ్మడి కడప జిల్లా సంస్థలో విధులు నిర్వర్తించారు. అలాగే పీలేరులో అనాథ వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తూ ఎందరో పేద, అనాథ విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దిన గొప్ప మానవతావాదిగా గుర్తింపు పొందారు. గత 5 ఏళ్లుగా ప్రేమాలయంలో జీవనం కొనసాగిస్తుండేవారు. కాగా అనారోగ్యంతో సోమవారం రాత్రి అపస్మారక స్థితిలోకి వెళ్లగా రాయచోటి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. దీంతో తన మిత్రులు లయన్ కొత్త సుదర్శన్, మున్సిపల్ అధికారి మల్లికార్జున, బంధువు లయన్ పీఎస్ హరినాధరెడ్డిల సహాయంతో ప్రత్యేక అంబులెన్స్‌లో మృతదేహాన్ని కడపకు తరలించి ఆయన నేత్రాలు ఎల్వీప్రసాద్ ఐ కేంద్రం వారికి, పార్థివదేహాన్ని కడప రిమ్స్ వైద్య విద్యార్థుల పరీక్షల కోసం అందించారు. ఈ కార్యక్రమంలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి సిబ్బంది డాక్టర్లు సతీశ్, అరవింద్, కడప రిమ్స్ మార్చురీ సిబ్బంది పాల్గొన్నారు.

చేతికొచ్చిన పంట చేజారింది

- 200 క్వింటాళ్ల పసుపు నీటమునక
- వడగండ్ల వానతో రైతు కన్నీరు


నేలవాలిన అరటి పంట

ఒంటిమిట్ట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అపార నష్టం రైతాంగాన్ని నట్టేట ముంచింది. చేతికొచ్చిన పంట నీటిలో కొట్టుకుపోయింది. కళ్లముందర పంట కొట్టుకుపోతుండడంతో రైతు కంట కన్నీరు కార్చారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని చింతరాజుపల్లె గ్రామంలో వడగండ్లతో కూడిన వర్షం కురిసింది. దీంతో సాగుచేసిన అరటి, బొప్పాయి పంటలు నేలకూలాయి. అలాగే ఎండబెట్టిన పసుపు నీటిలో కొట్టుకుపోయింది. అనుకోని వర్షం కురవడంతో రైతు నట్టేట మునిగిపోయారు. ఈ గ్రామానికి చెందిన రాసాల నరసింహులు సుమారు 200 క్వింటాళ్ల పసుపును ఉడకబెట్టి ఎండబెట్టారు. అనుకోని వర్షం కురవడంతో ఎండిన పసుపు నీటిలో కొట్టుకుపోయింది. అలాగే యామన వెంకటసుబ్బయ్య, బొల్లా ఓబులేశు, బొడ్డే శ్రీనివాసులకు చెందిన సుమారు 15 ఎకరాల అరటిపంట నేలపాలైంది. యామన సతీష్, తోట సుబ్బరాయుడు, రాసాల చిన్నయ్యలకు చెందిన సుమారు 13 ఎకరాల బొప్పాయి తోట నేలకొరిగింది. అదేవిధంగా కర్బూజ పంట కూడా దెబ్బతిన్నది. బొల్ల ఆదినారాయణ, సాకే రమణయ్యకు చెందిన ఐదెకరాల కర్బూజ పంట పూర్తిగా దెబ్బతిన్నది. ఇక వరిపంట కూడా నేలకొరిగింది. భారీ వర్షం కురవడంతో రైతు కుదేలయ్యారు. ఎండిన పసుపు నీటమునగడంతో సుమారు 20 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. అరటి, బొప్పాయి తోటలు నేలకొరగడంతో సుమారు రూ.24 లక్షల నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. చేతికొచ్చిన పంట నేలకొరగడంతో కన్నీరు మున్నీరవుతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

చేతికొచ్చిన పంట చేజారింది



పదిరోజుల్లో చేతికొచ్చే పంట పూర్తిగా ధ్వంసమైంది. తాము తీవ్రంగా నష్టపోయాం. తమను ప్రభుత్వమే ఆదుకోవాలి.

- సతీష్, రైతు, ఒంటిమిట్ట

ప్రభుత్వం ఆదుకోవాలి



అకాల వర్షంతో తాము తీవ్రంగా నష్టపోయాం. తమను ప్రభుత్వమే ఆదుకోవాలి. ఎండిన పసుపు నీటిలో కొట్టుకుపోయింది. చేతికొచ్చిన వరిపంట నేలపాలైంది.

- నరసింహులు, రైతు, ఒంటిమిట్ట

అరటి నేలకొరిగింది



ఆరు ఎకరాల అరటి పంట అకాల వర్షంతో నేలకొరిగింది. చేతికొచ్చిన పంట నేలపాలైంది. తీవ్రంగా నష్టం వాటిల్లింది.

- శ్రీనివాసులు, రైతు, ఒంటిమిట్ట

అకాల వర్షం... అపార నష్టం

- గాలి, వాన బీభత్సం
- తీవ్రంగా నష్టపోనున్న రైతులు


గాలివీడులో గాలి వానకు నేలరాలిన మామిడి కాయలు

గాలివీడు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షం అపార నష్టాన్ని మిగిల్చింది. గాలి వాన సృష్టించిన బీభత్సానికి చెట్లు నేలకొరగగా మామిడికాయలు పూర్తిగా రాలిపోయాయి. ఉదయమంతా ఎండ కాచి ఉక్కబోయగా సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. పెనుగాలులు వీచాయి. పట్టణంలో పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. గత రెండేళ్లుగా కరువు కాటకాలతో ఈ ప్రాంత రైతులు విలవిల్లాడుతున్నారు. పూలుకుంట, నూలివీడు, గుండ్లచెరువు, గోపనపల్లి, పేరంపల్లి, గాలివీడు తదితర గ్రామ పంచాయతీల్లో పెనుగాలులు వీచాయి. ఈ గాలులతో గోరాన్‌చెరువు పంచాయతీ కుమ్మరపల్లి సమీపంలో ఉన్న శ్రీకాంత్‌రెడ్డికి చెందిన మామిడి తోటలో కాయలన్నీ పూర్తిగా నేలమట్టమయ్యాయి. అంతేగాక కదిరి- రాయచోటి ప్రధాన రహదారి పెట్రోల్ బంక్ వద్ద పెద్ద వృక్ష కొమ్మలు విరిగి రహదారికి అడ్డుగా పడ్డాయి. గాలి వాన బీభత్సంతో మామిడి తోట రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. ప్రభుత్వం స్పందించి మామిడి తోటలకు ఇన్సూరెన్స్ వర్తించేలా చూడాలని పలువురు రైతులు కోరుతున్నారు.

వడగండ్ల వర్షానికి అరటి నేలమట్టం

లింగాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్ణపాపాయపల్లె, బోనాల, అంకేవానిపల్లె, వెలిదండ్ల గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు అరటి చెట్లు నేలమట్టమయ్యాయి. ఉదయం నుంచి ఎండ, ఉక్కపోత ఉండగా, సాయంత్రం ఒక్కసారిగా మేఘాలు కమ్ముకొని ఈదురు గాలులు మొదలయ్యాయి. కర్ణపాపాయపల్లెలో ఈదురుగాలులు, వడగండ్లు కురవడంతో అరటికి తీవ్రనష్టం వాటిల్లింది. దిగుబడులు చేతికందుతున్న దశలో ఈదురుగాలులు అరటి రైతు వెన్ను విరుస్తున్నాయి. బోనాల, వెలిదండ్ల, అంకేవానిపల్లె గ్రామాల్లో కూడా అరటికి నష్టం వాటిల్లింది. కర్ణపాపాయపల్లెలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.

ముత్యాల తలంబ్రాలు తిరుపతికి తరలింపు

- మండల అధికారులకు అందని తలంబ్రాలు
- భక్తుల అసంతృప్తి


ముత్యాల తలంబ్రాలు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట కోదండరామస్వామి కల్యాణోత్సవం అనంతరం భక్తులకు పంపిణీ చేయాల్సిన ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లను తిరుపతికి తరలించడంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఒంటిమిట్ట కోదండరామస్వామి కల్యాణోత్సవ ముత్యాల తలంబ్రాలకు ఓ ప్రత్యేకత ఉంది. కోదండరామస్వామి కల్యాణోత్సవంలో ఉపయోగించిన ముత్యాల తలంబ్రాలు తమ ఇంటిలో ఉంటే ఆ ఇల్లు ఎప్పుడూ సంతోషంగా ఉంటుందనేది భక్తుల విశ్వాసం. ఇందుకు విరుద్ధంగా టీటీడీ అధికారులు ప్రవర్తించారు. మిగిలిన ప్యాకెట్లను ఇక్కడి అధికారులకు కానీ, భక్తులకు కానీ ఇవ్వకుండా తిరుపతికి తరలించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్వామివారి కల్యాణోత్సవానికి విచ్చేసిన భక్తుల కొరకు సుమారు 1.70 లక్షల ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లను పంపిణీ చేసేందుకు సిద్ధం చేశారు. ఇందుకోసం కల్యాణవేదిక వద్ద ప్రత్యేక కౌంటర్లు కూడా నూతనంగా ఏర్పాటు చేశారు. ఒక్కో కౌంటరు శ్రీవారి సేవకులతో పాటు ఒక టీటీడీ సిబ్బందిని కూడా నియమించారు. ఈ కౌంటర్ల పంపిణీలో కూడా టీటీడీ సిబ్బంది చేతివాటం ప్రదర్శించారని పలువురు విమర్శిస్తున్నారు. కల్యాణం అనంతరం మిగిలిన ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లను టీటీడీ పరిపాలన భవనానికి తరలించారు. ముత్యాల తలంబ్రాలను పుష్పయాగం రోజున భక్తులకు పంపిణీ చేస్తారని పలువురు భక్తులు అనుకున్నారు. కానీ టీటీడీ అధికారులు వాటిని భక్తులకు, మండల అధికారులకు ఇవ్వలేదు. కల్యాణం అనంతరం మండల అధికారులకు, ప్రజా ప్రతినిధులకు తదితరులకు ముత్యాల తలంబ్రాలను ప్రతియేడాది పంపిణీ చేసేవారు. అందుకు విరుద్ధంగా ఈ ఏడాది తలంబ్రాలు పంపిణీ చేయకపోవడమేగాక వాటిని ఒక ప్రత్యేక వాహనంలో తిరుపతికి తరలించారు.

మేధావులే సమాజ మార్గదర్శకులు

- సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ


మాట్లాడుతున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): విశాల దృక్పథం కలిగిన మేధావుల వల్లే సమాజాభివృద్ధి జరుగుతుందని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం కడప నగరం ఎస్టీ భవన్‌లో శంకరయ్య సంస్మరణ సభలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సమాజ హితానికి మేధావుల మార్గనిర్దేశకత్వం ఎంతో అవసరమని అయితే మేధావులు సంకుచిత భావాలు కలిగి ఉండకూడదని, విశాల దృక్పథంతో సమాజంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేసే వారిలా ఉండాలన్నారు. మేధావులు ముందుగా మంచి ఆలోచన విధానాన్ని, మార్పులను, వారు ఉంటున్న పరిసర ప్రాంతాల్లోనూ, పనిచేసే సంస్థల్లోనూ వారి కుటుంబ సభ్యుల్లో తీసుకురావాలని సూచించారు. దురదృష్టవశాత్తు ప్రస్తుతం సోషల్ మీడియా ప్రభావం ఎక్కువైందని, దాన్ని ఆయుధంగా మలుచుకొని తమకు నచ్చిన భావజాలాన్ని ఆలోచన విధానాన్ని బలవంతంగా మనస్సుల్లో జొప్పించి ప్రజలను తమకు నచ్చిన రీతిలో మానసిక బానిసలుగా మార్చుకునే పరిణామాలు జరుగుతున్నాయన్నారు. ఈ ధోరణికి అడ్డుకట్ట వేయకపోతే ప్రజల్లో అనేక అంశాలపైన బేధాభిప్రాయాలు ఏర్పడి సమాజంలో అరాచక పరిస్థితులు ఏర్పడతాయన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహా రెడ్డి మాట్లాడుతూ సమాజంలో చదువుకున్న వారు మాత్రమే మేధావులు కారని, సమాజం కోసం మంచి ఆలోచనలు చేసే నిరక్షరాస్యులు కూడా మేధావులేనన్నారు. అనంతరం జేవీవీ రాష్ట్ర సంఘం అధ్యక్షుడు సురేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కుర్రా సురేష్‌బాబు, గోపాల్‌దాస్, ఇలియాస్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

వేపూరికోట వంతెనపై బొలెరో...లారీ ఢీ

- వాహనంలో ఇరుక్కుపోయి డ్రైవర్ దుర్మరణం
- ఎక్స్‌కవేటర్ సాయంతో మృతదేహం వెలికితీత
- జాతీయ రహదారిలో ట్రాఫిక్ జామ్
- మరొకరికి తీవ్రగాయాలు


బొలెరోలో ఇరుక్కుని మృతి చెందిన నసీబ్

ములకలచెరువు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ముంబై - చెన్నై జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి బొలెరో, లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బొలెలో డ్రైవర్ ఇరుక్కుపోయి దుర్మరణం చెందాడు. డ్రైవర్ వాహనంలోనే ఇరుక్కుపోవడంతో అతికష్టం మీద మృతదేహాన్ని బయటకు తీశారు. వంతెనపై జరిగిన రోడ్డు ప్రమాదంతో జాతీయ రహదారిలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ప్రమాదంలో మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నుంచి మదనపల్లెకు అరటికాయలు తీసుకెళ్తున్న బొలెరో వాహనం మార్గం మధ్యంలోని ములకల చెరువు మండలం వేపూరికోట సమీపంలోని చిన్నేరు వంతెనపై వచ్చే సరికి ఎదురుగా వచ్చిన లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మదనపల్లెకు చెందిన బొలెరో డ్రైవర్ నసీబ్(46) ఇరుక్కుపోయి దుర్మరణం చెందాడు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వాహనంలో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను అతి కష్టం మీద ఎక్స్‌కవేటర్ సహాయంతో బయటకు తీశారు. దీంతో జాతీయ రహదారికి అరగంటకు పైగా ట్రాఫిక్ స్తంభించి వాహనాలు బారులు తీరి నిలిచిపోయాయి. చివరకు డ్రైవర్ మృతదేహాన్ని బయటకు తీసి రోడ్డుపై నుంచి వాహనాలు పక్కకు తీసి ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. ఈ ప్రమాదంలో మదనపల్లెకు చెందిన మరో వ్యక్తి తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం డ్రైవర్ మృతదేహాన్ని కూడా పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లెకు తీసుకెళ్లారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్లోబల్ ఇండియా ప్రైమ్ కబడ్డీ లీగ్‌కు రెడ్డిప్రసాద్ ఎంపిక


గంపా రెడ్డిప్రసాద్

రామాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీ బీసీ కాలనీకి చెందిన గంపా నాగేంద్ర కుమారుడు గంపా రెడ్డిప్రసాద్ గ్లోబల్ ఇండియా ప్రైమ్ కబడ్డీ లీగ్‌కు ఎంపికయ్యారు. ఈ నెలలో హైదరాబాదులో నిర్వహించిన కబడ్డీ సెలెక్షన్‌లో గంపా రెడ్డిప్రసాద్ తనదైన శైలిలో ప్రతిభను కనబర్చడంతో ఈ గ్లోబల్ ఇండియా ప్రైమ్ కబడ్డీ లీగ్‌కు ఎంపిక చేశారు. గతంలో జమ్మూ కశ్మీర్‌లో నిర్వహించిన జాతీయ కబడ్డీ పోటీల్లో 2024లో ఆంధ్రప్రదేశ్ తరఫున గోల్డ్ మెడల్ సాధించారు. ఈ కబడ్డీని హర్యానా రాష్ట్రంలో ప్రపంచ దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులతో నిర్వహించారు. అందులో తమ మండలానికి చెందిన తన బిడ్డ పాల్గొనడం ఆనందంగా ఉందని గంపా రెడ్డిప్రసాద్ తండ్రి నాగేంద్ర తెలిపారు. అంతేగాకుండా గ్రామ ప్రజలు, మండల ప్రజలు ఈ ఎంపిక పట్ల హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో జాతీయ జట్టుకు ఎంపిక కావాలని మండల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



బద్వేలుటౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాలుగురోడ్ల కూడలి సమీపం సిద్దవటం రోడ్‌లోని ఓ సందులో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి సంబంధించిన కుటుంబీకులు ఎవరైనా వస్తే పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగిస్తామని పోలీసులు తెలిపారు.

మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

శిలువ యాత్ర



రైల్వేకోడూరు: దక్షిణాంధ్ర లూథరన్ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు



భాకరాపేట: యేసుక్రీస్తు శిలువ యాత్ర చేపట్టిన క్రైస్తవులు

సిద్దవటం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం మండలంలోని భాకరాపేట, మాధవరం, మోహిద్దిన్‌సాహెబ్‌పల్లె తదితర గ్రామాల్లో గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. బాకరాపేట సమీపంలో ఉన్న చర్చిలో యేసుప్రభు శిలువ యాత్ర చేపట్టారు. ఫాదర్ జోసఫ్ లారెన్స్ మాట్లాడుతూ యేసయ్య సిలువపై పలికిన మాటలు 'తండ్రి వీరేమి చేయుచున్నారో వీరెరుగరు.. వీరిని క్షమించండి' అని చెప్పెను అని యేసయ్య సిలువపై అన్న మాటలు గుర్తు చేశారు. చాముండేశ్వరిపేట, నిర్మలగిరి కాలనీ క్రైస్తవులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరులో...

దక్షిణాంధ్ర లూథరన్ చర్చిలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే ఘనంగా నిర్వహించారు. పాస్టర్ ఎస్. ఇమ్మానియేల్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన యేసు ప్రభువు కష్టాలను భక్తులకు వివరించారు. ప్రతి ఒక్కరూ యేసు అడుగుజాడల్లో నడవాలని కోరారు. ఏడు మాటల వివరాలను తెలియజేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చర్చ సంఘం అధ్యక్షుడు పాల్యం భానుప్రకాష్, సంఘ ప్రతినిధులు ప్రకాష్, ప్రభాకర్, సాల్మన్, చౌడవరం విజయ్‌కుమార్, ప్రదీప్ రాజ్‌కుమార్, పుష్పరాజ్, జయకుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



లూథరన్ చర్చిలో ప్రార్థన చేస్తున్న పాస్టర్ రాజశేఖర్

లక్కిరెడ్డిపల్లె: లక్కిరెడ్డిపల్లెలోని మిస్పా లూథరన్, దప్పేపల్లె చర్చిల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ రాజశేఖర్ తదితరులు ప్రార్థనలు నిర్వహించారు.

40 ఏళ్ల తర్వాత ఇరుగులమ్మ దేవర

- 123 మేకపోతులతో ఒకే వేదికలో విందు

గాలివీడు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపనల్లె పంచాయతీ పూజారివాండ్లపల్లెలో నల్లాబత్తిన వంశస్తుల ఆధ్వర్యంలో 40 సంవత్సరాల తర్వాత ఈనెల 20న గురుదేవర వైభవంగా నిర్వహించనున్నారు. ఈ వంశస్తులు అందరూ ఇరుగులమ్మను కులదేవతగా పూజిస్తారు. ఈ వంశస్తులు మండలంలోని గోపనపల్లి పంచాయతీలో అధిక శాతం మంది నివసిస్తుండగా నూలివీడు, పందికుంట, గరుగుపల్లి, గుండ్లచెరువు, పేరంపల్లె, సీసీపల్లె పంచాయతీల్లో మరి కొందరున్నారు.



నల్లాబత్తిన ఇలవేల్పు ఇరుగులమ్మ ఆలయం



గురుదేవరను నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

గురుదేవర నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

గురుదేవరకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం తెల్లవారుజామున ఇరుగులమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవం ప్రారంభమవుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. నల్లాబత్తిన వంవస్తులు వారికి సమీప బంధువులతో పాటు ఇతరులను కూడా దేవరకు ఆహ్వానించారు. అన్నమయ్య, కడప, చిత్తూరు జిల్లాల నుంచి కూడా పెద్ద ఎత్తున ప్రజలు హాజరు కానున్నారు. దేవరకు వచ్చే వారికి అసౌకర్యం కలగకుండా సుమారు 10 ఎకరాల్లో చదును చేసి తగు ఏర్పాట్లు చేస్తున్నారు. అన్నదాన ప్రాంతంలో బారికేడ్లను, క్యూలైన్లను ఏర్పాటు చేస్తున్నారు.

గురుదేవర మహోన్నత కార్యక్రమం



గురుదేవర ఒక మహోన్నత కార్యక్రమం. మా వంశాభివృద్ధికి, మా ఐకమత్యానికి ఈ కార్యక్రమం చిహ్నం. నాకు 75 సంవత్సరాలు. ఇప్పటి వరకు నేను ఒక గురుదేవర ఉత్సవాన్ని మాత్రమే చూశాను. ఆదివారం జరగనున్న గురదేరవ రెండోది. ఈ కార్యక్రమంలో వేలాది మంది పాల్గొంటారు.

- నల్లాబత్తిన ధర్మారెడ్డి, పూజారి, పూజారివాండ్లపల్లె

చారిత్రాత్మక కోటను పరిరక్షించుకోవాలి

- ఇంటాక్ జిల్లా కన్వీనర్ డాక్టర్ చిన్నప్పరెడ్డి

సిద్దవటం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : చారిత్రాత్మక కట్టడాలను పరిరక్షించుకోవాలని ఇంటాక్ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎస్.చిన్నప్పరెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన సిద్దవటం మట్లిరాజుల కోటలో ఆర్కియాలజికల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జి.సూర్యప్రకాష్ అధ్యతక్షన శుక్రవారం ప్రపంచ వారసత్వ దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చిన్నప్పరెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో అనేక అత్యంత ప్రాచీన చారిత్రాత్మక కట్టడాలు ఉన్నాయని, వాటితో పాటు అడవుల్లో వృక్ష సంపద, భూగర్భ సంపద కూడా ఉందన్నారు. ఆర్కియాలజికల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జి.సూర్యప్రకాష్ మాట్లాడుతూ ప్రాచీన కట్టడాలు, స్మారక చిహ్నాలు, స్థలాలను పరిరక్షించాలన్న ఉద్దేశ్యంతో ప్రతియేడాది ఏప్రిల్ 18న అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిద్దవటం రేంజర్ బి.కళావతి మాట్లాడుతూ లంకమల్ల అడవుల్లో ఆదిమానవుల ఆనవాళ్లు, శిలా శాసనాలు లభించాయన్నారు. ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లోని విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా శ్రీసాయి హైస్కూల్ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం ఇంటాక్ సభ్యులు రచించిన చరిత పుస్తకాన్ని అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆవిష్కరించారు. ఇంటాక్ సభ్యులు డాక్టర్ ఆర్.రంగనాథ్‌రెడ్డి, డాక్టర్ ఈశ్వర్‌రెడ్డి, పి.వెంకటరామిరెడ్డి, ఓవీ రెడ్డి, జిల్లా పురావస్తుశాఖ అధికారి డాకా రెడ్డి, సీనియర్ ఫొటోగ్రాఫర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

అంతర్జాతీయ కవి సమ్మేళనానికి ఆహ్వానం

రాజంపేట టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాదు - చిక్కడపల్లె త్యాగరాయ ఘనసభలో మే 8న నిర్వహించే అంతర్జాతీయ కవి సమ్మేళనానికి అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక గ్రామానికి చెందిన బాలరాజు జనార్దన్‌రాజును ఆహ్వానించారు. తెలంగాణ తెలుగు భాష చైతన్య సమితి 12వ వార్షికోత్సవం సందర్భంగా తెలుగు భాషకు పట్టాభిషేకం పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

జాగ్రత్తలతో అగ్ని ప్రమాదాల నివారణ

రాజంపేట టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదాల్లో తగిన జాగ్రత్తలు తీసుకుంటే నివారించుకోవచ్చని అగ్నిమాపక అధికారి మాబుసుభాన్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని కొత్తబస్టాండు పెట్రోల్ పంపు వద్ద ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.
అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఐదో రోజు అగ్ని ప్రమాదాల నివారణపై కరపత్రాలను పంచిపెట్టారు. అలాగే అగ్ని ప్రమాదం సంభవిస్తే ఏవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలి, ప్రమాద తీవ్రతను ఏవిధంగా తగ్గించుకోవచ్చుననే అంశంపై ఆయన వివరించారు.

క్షత్రియ సంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్షుల ఎన్నిక



రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన కొండూరు శరత్‌కుమార్‌రాజు

రాజంపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి):పుత్తూరులో నిర్వహించిన అఖిలభారత క్షత్రియ సంఘం ఎన్నికల్లో ఏకగ్రీవంగా రాష్ట్ర క్షత్రియ సంఘం అధ్యక్షుడిగా శరత్ కుమార్‌రాజును, అన్నమయ్య జిల్లా క్షత్రియ సంఘం అధ్యక్షుడిగా అంజన్‌రాజును శుక్రవారం ఎన్నుకున్నట్లు వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పుత్తూరు వేదికగా జరిగిన అఖిల భారత మహా సంఘం ఆధ్వర్యంలో ప్రకటించినట్లు తెలిపారు. అలాగే రాయలసీమ క్షత్రియ అధ్యక్షునిగా చేజర్ల సుబ్రమణ్యంరాజు, కోశాధికారి శివరామరాజును ఎన్నుకున్నట్లుగా తెలిపారు. క్షత్రియ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని, ఈ ఎన్నికల్లో సహకరించిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పూజలు







సిద్దవటం: గంగాభవాని అమ్మవారు... కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు...రాజంపేట: సీతారాముల కల్యాణం

సిద్దవటం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): 'సల్లంగ చూడవే గంగాభవాని' అంటూ భక్తులు పూజలు చేశారు. మండలంలోని మాధవరం-1 పంచాయతి బంగారుపేటలో వెలసిన గంగాభవాని అమ్మవారి 33వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం ఐదు గంటల నుంచి అమ్మవారికి అత్యంత ప్రీతికరమైన లక్ష కుంకుమార్చన కార్యక్రమం వైభవంగా జరిగింది. అనంతరం పూజలో పాల్గొన్న పుణ్య స్త్రీలందరికీ అమ్మవారి ప్రసాదంగా మంగళ ప్రదమైన గాజులు, పసుపు కుంకుమలు అందజేశారు.

వైభవంగా రాములోరి కల్యాణం

రాజంపేట టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండలం గొందివారిపల్లె కోదండరామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన ఈ కల్యాణ మహోత్సవానికి మిట్టమీదపల్లె పరిధిలోని సుండువారిపల్లె, సింగనవారిపల్లె,కొమ్మివారిపల్లె ప్రజలతో పాటు రాజంపేట చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. స్వామివారి కల్యాణం తిలకించి పరవశించారు.

మోటార్లలోని కాపర్ వైర్ చోరీ

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిన్నెపాడు పంచాయతీలోని పర్వతరెడ్డిగారిపల్లె, దిన్నెపాడు గ్రామాల్లో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కాపర్ వైరును అపహరించకపోయినట్లు బాధితులు తెలిపారు. ఈ సందర్భంగా నారాయణ రెడ్డి, షేక్. కరీం, శివారెడ్డి, కాలేషా, ఇమాము, బాషా మరో ఇద్దరు రైతుల మోటార్లను బయటక తీసి పగలగొట్టి అందులో ఉప్ప కారప్ వైరును అపహరించుకెళ్లారని బాధితులు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించండి

రాయచోటిటౌన్, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): అన్ని సౌకర్యాలు గల ప్రభుత్వ బడిలోనే పిల్లలను చేర్పించాలని విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శివప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్థానిక డీఈవో కార్యాలయంలో బడిఈడు పిల్లలను బడిలో చేర్పించలంటూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బీ. హరిప్రసాద్, జాబీర్‌లు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఒత్తిడి లేని వాతావరణంలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేంద్రారెడ్డి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ప్రసాద్, యూటీఎఫ్ రాయచోటి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హఫీజుల్లా, రాజారమేశ్, సహాధ్యక్షుడు రెడ్డిబసయ్య, చిన్నమండెం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, కిఫాయత్ పాల్గొన్నారు.

'ఎస్సీ ఉప వర్గీకరణ ఆర్డినెన్స్ హర్షణీయం'



మాట్లాడుతున్న రామాంజనేయులు మాదిగ

రాయచోటిటౌన్, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి):ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్-2 తీసుకురావడం హర్షణీయమని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు రామాంజనేయులు మాదిగ పేర్కొన్నారు. శుక్రవారం వారు రాయచోటి పట్టణంలోని మంత్రి మండిపల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు సలవ రామాంజనేయులు మాదిగ ఆధ్వర్యంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంఈఎఫ్ నాయకులు హరిబాబు, జిల్లా నాయకులు వెంకట్రమణ, రామక్రిష్ణ, వెంకట్రమణ, దళిత వేధిక రాష్ట్రల నాయకులు ఓబులేసు, లాయర్ వెంకట్రమణ, పీ. మల్లికార్జున, నాగాంజనేయులు, శివ, కిరణ్‌కుమార్ తదితర ఎంఆర్‌పీఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు

ఒంటిమట్ట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్టలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులను చేస్తున్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు సుబ్రమణ్యం తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు మరమ్మతు పనులను చేస్తున్నట్లు తెలిపారు. దీని కారణంగా ఆ సమయంలో ఒంటిమిట్ట టౌను, మాధవరం, మండపంపల్లె, సిద్దవటం, బాకరాపేట, జ్యోతి గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. కావున వినియోగదారులు సహకరించాలన్నారు.

నూతన దేవతామూర్తుల విగ్రహాలు రాక

సిద్దవటం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : బాకరాపేట గ్రామంలో వెలసిన భవాని శంకర్‌స్వామి ఆలయ విగ్రహాల పునఃప్రతిష్ఠ సందర్భంగా ఆళ్లగడ్డ గ్రామం నుంచి శుక్రవారం విఘ్నేశ్వరుడు, బాల లింగం, పార్వతిదేవి, సుబ్రమణ్యం, బందీశ్వరుడు, నంది, దేవతామూర్తుల విగ్రహాలు వచ్చాయి. వేదపండితులు యల్లమ్మ గుడివద్ద ప్రత్యేక పూజలు విగ్రహాలను తీసుకువచ్చారు. ఆలయ పూజారి మధుసూధన్‌శర్మ మాట్లాడుతూ బుధవారం దేవతామూర్తుల విగ్రహప్రతిష్ఠ జరుగుతుందన్నారు.

కనుల పండువగా విగ్రహ ప్రతిష్ఠ



ప్రతిష్ఠించిన సీతారామ లక్ష్మణ హనుమంతు విగ్రహాలు

చిట్వేలి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): చిట్వేలి గాజులవీధిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శుక్రవారం సీతారామ లక్ష్మణ ఆంజనేయ ధ్వజమూర్తుల ప్రతిష్ఠ చేశారు. అనంతరం రిటైర్డ్ టీచర్ దోనెల రవీంద్ర, శ్రీమతి వెంకటకల్యాణి కుటుంబ సభ్యులు మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం 5 గంటల నుంచి సీతారాముల కల్యాణోత్సవాన్ని కన్నులపండుగలా నిర్వహించారు. పురోహితులు రాయపెద్ది సత్యనారాయణ శర్మ, గ్రా మ పెద్దలు, కార్యనిర్వాహకుల సహకారంతో కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర ఖాదీ విలేజ్ ఇండస్ట్రీ చైర్మన్ కేకే చౌదరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మి స్వామివారిని దర్శించుకున్నారు. స్థానిక ఉపసర్పంచ్ చౌడవరం మహేశ్వర్‌రెడ్డి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో లారీ సుబ్బరాయుడు, బాలు రామాంజనేయులు, కాకర్ల నాగార్జున, గుత్తి నరసింహ, మాదాసు నరసింహ, రాజా, నాగేశ్వరరావు, రెడ్డయ్య, చెవ్వు శ్రీనివాసులరెడ్డి, నవీన్ పాల్గొన్నారు.

'సోనియా, రాహుల్ కుటుంబంపై బీజేపీ కక్షసాధింపు తగదు'

రాజంపేట టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కక్ష సాధింపు మానుకోవాలని ఏపీసీసీ కార్యవర్గ సభ్యుడు ఎ.శ్రీనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం రాజంపేట ఆర్ అండ్‌బి బంగ్లాలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎదుగుదలను ఓర్వలేక ప్రధాని నరేంద్రమోదీ సంస్థలైన సీబీఐ, ఈడీలను సొంత ఏజెన్సీలుగా వాడుకొంటూ ప్రతిపక్షంపై అక్రమ కేసులు పెట్టడం తగదన్నారు. డీసీసీ అధికార ప్రతినిధి అహ్మద్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, వెంకటేశ్ పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీని ఆదర్శంగా తీర్చి దిద్దటమే లక్ష్యం: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు మార్కెట్ కమిటీని ఆదర్శంగా తీర్చి దిద్దటమే లక్ష్యమని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అన్నారు. శుక్రవారం జనసేన పార్టీ కార్యాలయంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి మహిళకు కేటాయించడంతో మైసూరి వారిపల్లికి చెందిన జనసేన నాయకుడు పగడాల చంద్రశేఖర్ సతీమణి వరలక్ష్మిని నియమించినట్లు తెలిపారు. మార్కెట్ కమిటీని ఆదర్శ ప్రాయంగా తీర్చిదిద్దడమే లక్ష్య మన్నారు. 24 గంటలూ ప్రజల కోసం పనిచేసే పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గాలి వానకు నష్టపోయిన రైతులకు సాయం కోసం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసు కెళతానన్నారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర ఉద్యాన పంటల రుణ మాఫీ, పంటల బీమా, అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసు కువచ్చారు. నూతన మార్కెట్ కమిటీ చైర్మన్ పగడాల వరలక్ష్మి మాట్లాడుతూ అందరి సహకారంతో మార్కెట్ కమిటీని అభివృద్ధి చేస్తామన్నారు. తనకు బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్, హరిప్రసాద్, రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్, రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర తదితరులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం నియోజకవర్గ నాయకులు వరలక్ష్మిని సన్మానించారు.

మహాభారత యజ్ఞం పుణ్యకార్యం

వీరబల్లి, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): మహాభారత యజ్ఞం ఒక పుణ్యకార్యమని ఈ భారతాన్ని మట్లి పంచాయతీలో ప్రతియేటా నిర్వహించడం గర్వించదగ్గ విషయమని రూరల్ సీఐ వరప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం మట్లి పంచాయతీలోని మాండవ్యనది ఒడ్డున వెలిసిన శ్రీకోదండరామస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన భారతాన్ని ఆయన ప్రారంభించారు. ఎస్ఐ మోహన్‌నాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కూలీలకు డబ్బు ఇచ్చి పుణ్యం కట్టుకోండి

పెనగలూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం కూలీలకు డబ్బులిచ్చి పుణ్యం కట్టుకోవాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి ఆనుగొపెంట ఆదినారాయణ కోరారు. చెయ్యేటి నుంచి సింగనమల చెరువుకు సాగునీరు అందించే కొత్త సింగనమల ప్రాంతం ప్రజలు పనిచేస్తున్న కాలువ పూడిక తీత పనులను శుక్రవారం పరిశీలించారు. వారం రోజుల లోపుల కూలీ డబ్బులు చెల్లించకపోతే ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఉపాధి కూలీలతో ధర్నా చేస్తామని హెచ్చరించారు.

పెద్దఓరంపాడులో రామాలయం ప్రారంభం

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : పెద్దఓరంపాడులో నూతనంగా నిర్మించిన సీతారామాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. మొదటిరోజు గణపతిపూజతో ప్రారంభించి కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. గ్రామ పెద్దలు, ప్రజలు హాజరై భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

చదువుతో పాటు క్రీడలూ అవసరం

గాలివీడు, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలూ అవసరమని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని నూలివీడు కేంద్రంలో గత పది రోజులుగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రథమ బహుమతి రూ.30 వేలు, ద్వితీయ బహుమతి రూ.20 వేలు అందజేశారు. మాజీ సర్పంచ్ ఫరీద్ బాషా, మాజీ ఎంపీటీసీ భతుల్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య, రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటశివారెడ్డి పాల్గొన్నారు.

వక్ఫ్ చట్టంపై కమిటీ వేయాలి

- బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు

రాయచోటిటౌన్, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ముస్లింలకు సంబంధించిన ఆస్తులపై చట్టాన్ని సవరిస్తూ తీసుకొచ్చిన కొత్త చట్టంపై ముస్లిం మైనార్టీల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం కమిటీ వేయాలని అన్నమయ్య జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఇడగొట్టు నాగేశ్వరరావు, బీసీ సమన్వయ కమిటీ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ, గౌరవాధ్యక్షుడు దువ్వూరు నరసింహాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మీడియాతో మాట్లాడుతూ ప్రజల చేత ఎన్నుకోబడ్డ ప్రభుత్వాలు ప్రజల ఆస్తులు, స్వేచ్ఛ, హక్కులపై దాడి చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు.

టీడీపీ కార్యకర్త పప్పిరెడ్డి మృతి బాధాకరం

రామాపురం, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన పప్పిరెడ్డి ఇరగంరెడ్డి మృతి బాధాకరమని టీడీపీ నేత డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

రామాపురం, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ ఆఫ్ రాయచోటిటౌన్ ఆధ్వర్యంలో తుమ్మగింజల మహేస్విన్ పుట్టినరోజు సందర్భంగా లయన్ అంజనేయులు ఆర్థిక సహాయంతో ప్రేమాలయం వృద్ధాశ్రమంలో శుక్రవారం అన్నదానం చేసినట్లు అధ్యక్షుడు లయన్ శివారెడ్డి తెలిపారు. లయన్ నిషాద్‌రాంప్రవేశ్, దాత కుటుంబ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్, పెట్రోల్ బంకుల వద్ద జాగ్రత్తలు పాటించాలి

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): పెట్రోల్, గ్యాస్ గోదాములు వద్ద అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని అగ్నిమాపక ఫైర్ ఆఫీసర్ రామయ్య పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం లక్కిరెడ్డిపల్లెలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్, హెచ్‌పీ గ్యాస్ గోదాము వద్ద విన్యాసాలు నిర్వహించారు. కార్బర్‌డయాక్సైడ్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంద పాల్గొన్నారు.

మహిళా డాక్టర్‌ను నియమించండి

పెనగలూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పెనగలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వం వెంటనే మహిళా డాక్టర్‌ను నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ రెండు నెలల కిందట వ్యక్తిగత కారణాల వల్ల ఆసుపత్రికి రావడం లేదు. అందువల్ల ఆసుపత్రికి వచ్చే మహిళలు అన్ని సమస్యలను పురుష డాక్టర్‌కు చెప్పుకోలేకపోతున్నారని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఆటో డ్రైవరు మృతి


మృతిచెందిన పాలెం రాజు

చెన్నూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక హైవే రహదారిలో రెండు రోజుల కిందట ఆటోను వెనుక వైపు నుంచి వచ్చి లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా ఆటో డ్రైవరు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. అయితే ఈయన కూడా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలిలా.. ఈ నెల 16న నలుగురు ప్రయాణికులతో ఆటో చెన్నూరు నుంచి కడప నగరానికి వెళుతోంది. కాగా మైదుకూరు నుంచి కడపకు వెళుతున్న లారీ వెనుక వైపు నుంచి వచ్చి ఆటోను ఢీకొనగా అందులో ప్రయాణిస్తున్న స్థానిక అరుంధతీనగర్‌కు చెందిన లక్ష్మిగాండ్ల బాలమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనలో మిగిలిన వారికి స్వల్ప గాయలవడంతో పాటు ఆటో డ్రైవరు పాలెం రాజు(26) తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో వారందరినీ రిమ్స్‌కు తరలించారు. కాగా చికిత్స పొందుతూ శుక్రవారం కడప రిమ్స్‌లో డ్రైవర్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు రెండేళ్లలోపు ఇద్దరు చిన్నారులు ఉన్నారు. ఆటో డ్రైవరు మృతి చెందడంతో స్థానిక కొత్త గాంధీనగర్‌లో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

కారు అదుపుతప్పి ఒకరు...


వెంకటసాయి మృతదేహం

సింహాద్రిపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నిడివెలగల గ్రామం వద్ద కారు అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో వెంకటసాయి(28) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... గురువారం రాత్రి 11గంటల సమయంలో సింహాద్రిపురం నుంచి పులివెందుల వైపు బయలుదేరిన ఏపీ16సికె 0005 నెంబరు గల వాహనం నిడివెలగల గ్రామం వద్దకు రాగానే స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ వాహనంలో నలుగురు వ్యక్తులు ప్రయాణిస్తున్నారు. వీరందరూ పులివెందు లకు చెందినవారే. ఈ సంఘటనలో వెంకటసాయి మృతితో పాటు మరో ముగ్గురు మణిదీప్, శివచంద్ర, వేణు అనే వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. వేణు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. సంఘటనా స్థలాన్ని పులివెందుల సీఐ ఎస్వీ రమణ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పులివెందుల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కారు ఢీకొని టీడీపీ కార్యకర్త...



మృతిచెందిన ఇరగంరెడ్డి

రామాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారిలోని మండల కేంద్రమైన రామాపురం పోలీస్ స్టేషన్ ఎదురుగా శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు స్కూటర్‌ను ఢీకొని టీడీపీ కార్యకర్త పప్పిరెడ్డి ఇరగంరెడ్డి (50) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటసుధాకర్ రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు... మండలంలోని హసనాపురం పంచాయతీ గొల్లపల్లికి చెందిన పప్పిరెడ్డి ఇరగంరెడ్డి రామాపురంకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా పోలీస్‌స్టేషన్ సమీపానికి రాగానే కడప నుంచి రాయచోటి వైపు వెళ్తున్న కారు స్కూటర్‌ను ఢీకొంది. ఇరగంరెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని శవపరీక్షకై లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం బంధువులకు అప్పగించారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కారు, మోపెడ్‌ను ఢీకొన్న కంటైనర్

- ఇరువురికి గాయాలు


పెంజి అనంతపురం వద్ద కంటైనర్ మీద పడటంతో నుజ్జయిన కారు

కొండాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంజి అనంతపురం గ్రామం వద్ద శుక్రవారం కారు, మోపెడ్‌ను కంటైనర్ ఢీకొనడంతో ఇరువురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... కడప వైపు నుంచి వెళుతున్న గుజరాత్‌కు చెందిన కంటైనర్ వాహనం, కొండాపురం నుంచి అటువైపు వెళుతున్న టీవీఎస్ మోపెడ్‌ను ఢీకొంది. దీంతో మోపెడ్‌లో వెళ్తున్న పెద్దన్న అనే వ్యక్తి ఎగిరి కింద పడడంతో గాయాలయ్యాయి. అదిచూచి ఇదే వైపు కడప నుంచి తాడిపత్రికి కారులో వెళుతున్న రమణారెడ్డి అనే కారు డ్రైవర్ కంటైనర్‌ను ఆపేందుకు ప్రయత్నించాడు. దీంతో కారును ఓవర్‌టేక్ చేయబోయి కంటైనర్ కారు మీద పడింది. ఈ సంఘటనలో కారు నుజ్జు నుజ్జయి రమణారెడ్డికి గాయాలయ్యాయి. కాగా వారిరువురిని తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి 108 వాహనంలో తరలించారు. సంఘటనా స్థలానికి కొండాపురం ఎస్సై ప్రతాప్‌రెడ్డి, సిబ్బంది చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శరీరమే మరణం.. నేత్రాలు పదిలం

- కళ్లను ఐ బ్యాంకుకు అందజేసిన మిత్రులు


నేత్రాలను దానం చేస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): శరీరంలో జీవం పోయినా.. ఆయన చూపు మాత్రం పదిలంగా ఉండాలని వారు ఆలోచించారు. వచ్చిందే తడవుగా ఆ నేత్రాలను ఇతరులకు ఉపయోగపడేలా ఓ స్వచ్ఛంద సంస్థకు అందజేశారు. వివరాల్లోకెళ్తే.. అన్నమయ్య జిల్లా కలికిరి మండలం కంభంవారి పల్లెకు చెందిన శ్రీనివాసులరెడ్డి మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ప్రభుత్వంలో ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో పనిచేశారు. పలు మార్లు శత్రు దేశాలతో యుద్ధంలో పాల్గొన్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఎయిర్ ఫోర్స్ నుంచి వచ్చిన తరువాత కూడా వివాహం చేసుకోకుండా జిల్లాలోని పీలేరు, రాయచోటి నియోజకవర్గాల్లో పలు విద్యాసంస్థల ఆరంభంలో కీలకపాత్ర పోషించారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించే అమ్మఒడి (అనాథ పిల్లల సంక్షేమ సంస్థ) ఉమ్మడి కడప జిల్లా సంస్థలో విధులు నిర్వర్తించారు. అలాగే పీలేరులో అనాథ వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తూ ఎందరో పేద, అనాథ విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దిన గొప్ప మానవతావాదిగా గుర్తింపు పొందారు. గత 5 ఏళ్లుగా ప్రేమాలయంలో జీవనం కొనసాగిస్తుండేవారు. కాగా అనారోగ్యంతో సోమవారం రాత్రి అపస్మారక స్థితిలోకి వెళ్లగా రాయచోటి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. దీంతో తన మిత్రులు లయన్ కొత్త సుదర్శన్, మున్సిపల్ అధికారి మల్లికార్జున, బంధువు లయన్ పీఎస్ హరినాథరెడ్డిల సహాయంతో ప్రత్యేక అంబులెన్స్‌లో మృతదేహాన్ని కడపకు తరలించి ఆయన నేత్రాలు ఎల్వీప్రసాద్ ఐ కేంద్రం వారికి, పార్థివదేహాన్ని కడప రిమ్స్ వైద్య విద్యార్థుల పరీక్షల కోసం అందించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి సిబ్బంది డాక్టర్లు సతీశ్, అరవింద్, కడప రిమ్స్ మార్చురీ సిబ్బంది పాల్గొన్నారు.

చేతికొచ్చిన పంట చేజారింది

- 200 క్వింటాళ్ల పసుపు నీటమునక
- వడగండ్ల వానతో రైతు కన్నీరు


నేలవాలిన అరటి పంట

ఒంటిమిట్ట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అపార నష్టం రైతాంగాన్ని నట్టేట ముంచింది. చేతికొచ్చిన పంట నీటిలో కొట్టుకుపోయింది. కళ్లముందర పంట కొట్టుకుపోతుండడంతో రైతు కంట కన్నీరు కార్చారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని చింతరాజుపల్లె గ్రామంలో వడగండ్లతో కూడిన వర్షం కురిసింది. దీంతో సాగుచేసిన అరటి, బొప్పాయి పంటలు నేలకూలాయి. అలాగే ఎండబెట్టిన పసుపు నీటిలో కొట్టుకుపోయింది. అనుకోని వర్షం కురవడంతో రైతు నట్టేట మునిగిపోయారు. ఈ గ్రామానికి చెందిన రాసాల నరసింహులు సుమారు 200 క్వింటాళ్ల పసుపును ఉడకబెట్టి ఎండబెట్టారు. అనుకోని వర్షం కురవడంతో ఎండిన పసుపు నీటిలో కొట్టుకుపోయింది. అలాగే యామన వెంకటసుబ్బయ్య, బొల్లా ఓబులేశు, బొడ్డే శ్రీనివాసులకు చెందిన సుమారు 15 ఎకరాల అరటిపంట నేలపాలైంది. యామన సతీష్, తోట సుబ్బరాయుడు, రాసాల చిన్నయ్యలకు చెందిన సుమారు 13 ఎకరాల బొప్పాయి తోట నేలకొరిగింది. అదేవిధంగా కర్బూజ పంట కూడా దెబ్బతిన్నది. బొల్ల ఆదినారాయణ, సాకే రమణయ్యకు చెందిన ఐదెకరాల కర్బూజ పంట పూర్తిగా దెబ్బతిన్నది. ఇక వరిపంట కూడా నేలకొరిగింది. భారీ వర్షం కురవడంతో రైతు కుదేలయ్యారు. ఎండిన పసుపు నీటమునగడంతో సుమారు 20 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. అరటి, బొప్పాయి తోటలు నేలకొరగడంతో సుమారు రూ.24 లక్షల నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. చేతికొచ్చిన పంట నేలకొరగడంతో కన్నీరు మున్నీరవుతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

చేతికొచ్చిన పంట చేజారింది



పదిరోజుల్లో చేతికొచ్చే పంట పూర్తిగా ధ్వంసమైంది. తాము తీవ్రంగా నష్టపోయాం. తమను ప్రభుత్వమే ఆదుకోవాలి.

- సతీష్, రైతు, ఒంటిమిట్ట

ప్రభుత్వం ఆదుకోవాలి



అకాల వర్షంతో తాము తీవ్రంగా నష్టపోయాం. తమను ప్రభుత్వమే ఆదుకోవాలి. ఎండిన పసుపు నీటిలో కొట్టుకుపోయింది. చేతికొచ్చిన వరిపంట నేలపాలైంది.

- నరసింహులు, రైతు, ఒంటిమిట్ట

అరటి నేలకొరిగింది



ఆరు ఎకరాల అరటి పంట అకాల వర్షంతో నేలకొరిగింది. చేతికొచ్చిన పంట నేలపాలైంది. తీవ్రంగా నష్టం వాటిల్లింది.

- శ్రీనివాసులు, రైతు, ఒంటిమిట్ట

అకాల వర్షం... అపార నష్టం

- గాలి, వాన బీభత్సం
- తీవ్రంగా నష్టపోనున్న రైతులు


గాలివీడులో గాలి వానకు నేలరాలిన మామిడి కాయలు

గాలివీడు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షం అపార నష్టాన్ని మిగిల్చింది. గాలి వాన సృష్టించిన బీభత్సానికి చెట్లు నేలకొరగగా మామిడికాయలు పూర్తిగా రాలిపోయాయి. ఉదయమంతా ఎండ కాచి ఉక్కబోయగా సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. పెనుగాలులు వీచాయి. పట్టణంలో పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. గత రెండేళ్లుగా కరువు కాటకాలతో ఈ ప్రాంత రైతులు విలవిల్లాడుతున్నారు. పూలుకుంట, నూలివీడు, గుండ్లచెరువు, గోపనపల్లి, పేరంపల్లి, గాలివీడు తదితర గ్రామ పంచాయతీల్లో పెనుగాలులు వీచాయి. ఈ గాలులతో గోరాన్‌చెరువు పంచాయతీ కుమ్మరపల్లి సమీపంలో ఉన్న శ్రీకాంత్‌రెడ్డికి చెందిన మామిడి తోటలో కాయలన్నీ పూర్తిగా నేలమట్టమయ్యాయి. అంతేగాక కదిరి- రాయచోటి ప్రధాన రహదారి పెట్రోల్ బంక్ వద్ద పెద్ద వృక్ష కొమ్మలు విరిగి రహదారికి అడ్డుగా పడ్డాయి. గాలి వాన బీభత్సంతో మామిడి తోట రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. ప్రభుత్వం స్పందించి మామిడి తోటలకు ఇన్సూరెన్స్ వర్తించేలా చూడాలని పలువురు రైతులు కోరుతున్నారు.

వడగండ్ల వర్షానికి అరటి నేలమట్టం

లింగాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్ణపాపాయపల్లె, బోనాల, అంకేవానిపల్లె, వెలిదండ్ల గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు అరటి చెట్లు నేలమట్టమయ్యాయి. ఉదయం నుంచి ఎండ, ఉక్కపోత ఉండగా, సాయంత్రం ఒక్కసారిగా మేఘాలు కమ్ముకొని ఈదురు గాలులు మొదలయ్యాయి. కర్ణపాపాయపల్లెలో ఈదురుగాలులు, వడగండ్లు కురవడంతో అరటికి తీవ్రనష్టం వాటిల్లింది. దిగుబడులు చేతికందుతున్న దశలో ఈదురుగాలులు అరటి రైతు వెన్ను విరుస్తున్నాయి. బోనాల, వెలిదండ్ల, అంకేవానిపల్లె గ్రామాల్లో కూడా అరటికి నష్టం వాటిల్లింది. కర్ణపాపాయపల్లెలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.

ముత్యాల తలంబ్రాలు తిరుపతికి తరలింపు

- మండల అధికారులకు అందని తలంబ్రాలు
- భక్తుల అసంతృప్తి


ముత్యాల తలంబ్రాలు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట కోదండరామస్వామి కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు పంపిణీ చేయాల్సిన ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లను తిరుపతికి తరలించడంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఒంటిమిట్ట కోదండరామస్వామి కల్యాణోత్సవ ముత్యాల తలంబ్రాలకు ఓ ప్రత్యేకత ఉంది. కోదండరామస్వామి కల్యాణోత్సవంలో ఉపయోగించిన ముత్యాల తలంబ్రాలు తమ ఇంటిలో ఉంటే ఆ ఇల్లు ఎప్పుడూ సంతోషంగా ఉంటుందనేది భక్తుల విశ్వాసం. ఇందుకు విరుద్ధంగా టీటీడీ అధికారులు ప్రవర్తించారు. మిగిలిన ప్యాకెట్లను ఇక్కడి అధికారులకు కానీ, భక్తులకు కానీ ఇవ్వకుండా తిరుపతికి తరలించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్వామి వారి కల్యాణోత్సవానికి విచ్చేసిన భక్తుల కొరకు సుమారు 1.70 లక్షల ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లను పంపిణీ చేసేందుకు సిద్ధం చేశారు. ఇందుకోసం కల్యాణవేదిక వద్ద ప్రత్యేక కౌంటర్లు కూడా నూతనంగా ఏర్పాటు చేశారు. ఒక్కో కౌంటరు శ్రీవారి సేవకులతో పాటు ఒక టీటీడీ సిబ్బందిని కూడా నియమించారు. ఈ కౌంటర్ల పంపిణీలో కూడా టీటీడీ సిబ్బంది చేతివాటం ప్రదర్శించారని పలువురు విమర్శిస్తున్నారు. కల్యాణం అనంతరం మిగిలిన ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లను టీటీడీ పరిపాలన భవనానికి తరలించారు. ముత్యాల తలంబ్రాలను పుష్పయాగం రోజున భక్తులకు పంపిణీ చేస్తారని పలువురు భక్తులు అనుకున్నారు. కానీ టీటీడీ అధికారులు వాటిని భక్తులకు, మండల అధికారులకు ఇవ్వలేదు. కల్యాణం అనంతరం మండల అధికారులకు, ప్రజా ప్రతినిధులకు తదితరులకు ముత్యాల తలంబ్రాలను ప్రతియేడాది పంపిణీ చేసేవారు. అందుకు విరుద్ధంగా ఈ ఏడాది తలంబ్రాలు పంపిణీ చేయకపోవడమేగాక వాటిని ఒక ప్రత్యేక వాహనంలో తిరుపతికి తరలించారు.

మేధావులే సమాజ మార్గదర్శకులు

- సీబీఐ మాజీ జేడీ లక్ష్మినారాయణ


మాట్లాడుతున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మినారాయణ

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): విశాల దృక్పథం కలిగిన మేధావుల వల్లే సమాజాభివృద్ధి జరుగుతుందని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మినారాయణ తెలిపారు. శుక్రవారం కడప నగరం ఎస్టీ భవన్‌లో శంకరయ్య సంస్మరణ సభలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సమాజ హితానికి మేధావుల మార్గనిర్దేశకత్వం ఎంతో అవసరమని అయితే మేధావులు సంకుచిత భావాలు కలిగి ఉండకూడదని, విశాల దృక్పథంతో సమాజంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేసే వారిలా ఉండాలన్నారు. మేధావులు ముందుగా మంచి ఆలోచన విధానాన్ని, మార్పులను, వారు ఉంటున్న పరిసర ప్రాంతాల్లోనూ, పనిచేసే సంస్థల్లోనూ వారి కుటుంబ సభ్యుల్లో తీసుకురావాలని సూచించారు. దురదృష్టవశాత్తు ప్రస్తుతం సోషల్ మీడియా ప్రభావం ఎక్కువైందని, దాన్ని ఆయుధంగా మలుచుకొని తమకు నచ్చిన భావజాలాన్ని ఆలోచన విధానాన్ని బలవంతంగా మనస్సుల్లో జొప్పించి ప్రజలను తమకు నచ్చిన రీతిలో మానసిక బానిసలుగా మార్చుకునే పరిణామాలు జరుగుతున్నాయన్నారు. ఈ ధోరణికి అడ్డుకట్ట వేయకపోతే ప్రజల్లో అనేక అంశాలపైన బేధాభిప్రాయాలు ఏర్పడి సమాజంలో అరాచక పరిస్థితులు ఏర్పడతాయన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహా రెడ్డి మాట్లాడుతూ సమాజంలో చదువుకున్న వారు మాత్రమే మేధావులు కారని, సమాజం కోసం మంచి ఆలోచనలు చేసే నిరక్షరాస్యులు కూడా మేధావులేనన్నారు. అనంతరం జేవీవీ రాష్ట్ర సంఘం అధ్యక్షుడు సురేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కుర్రా సురేష్‌బాబు, గోపాల్‌దాస్, ఇలియాస్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

వేపూరికోట వంతెనపై బొలెరో...లారీ ఢీ

- వాహనంలో ఇరుక్కుపోయి డ్రైవర్ దుర్మరణం
- ఎక్స్‌కవేటర్ సాయంతో మృతదేహం వెలికితీత
- జాతీయ రహదారిలో ట్రాఫిక్ జామ్
- మరొకరికి తీవ్రగాయాలు


బొలెరోలో ఇరుక్కుని మృతి చెందిన నసీబ్

ములకలచెరువు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ముంబై - చెన్నై జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి బొలెరో, లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బొలెలో డ్రైవర్ ఇరుక్కుపోయి దుర్మరణం చెందాడు. డ్రైవర్ వాహనంలోనే ఇరుక్కుపోవడంతో అతికష్టం మీద మృతదేహాన్ని బయటకు తీశారు. వంతెనపై జరిగిన రోడ్డు ప్రమాదంతో జాతీయ రహదారిలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ప్రమాదంలో మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నుంచి మదనపల్లెకు అరటికాయలు తీసుకెళ్తున్న బొలెరో వాహనం మార్గం మధ్యంలోని ములకల చెరువు మండలం వేపూరికోట సమీపంలోని చిన్నేరు వంతెనపై వచ్చే సరికి ఎదురుగా వచ్చిన లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మదనపల్లెకు చెందిన బొలెరో డ్రైవర్ నసీబ్(46) ఇరుక్కుపోయి దుర్మరణం చెందాడు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వాహనంలో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను అతి కష్టం మీద ఎక్స్‌కవేటర్ సహాయంతో బయటకు తీశారు. దీంతో జాతీయ రహదారికి అరగంటకు పైగా ట్రాఫిక్ స్తంభించి వాహనాలు బారులు తీరి నిలిచిపోయాయి. చివరకు డ్రైవర్ మృతదేహాన్ని బయటకు తీసి రోడ్డుపై నుంచి వాహనాలు పక్కకు తీసి ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. ఈ ప్రమాదంలో మదనపల్లెకు చెందిన మరో వ్యక్తి తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం డ్రైవర్ మృతదేహాన్ని కూడా పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లెకు తీసుకెళ్లారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్లోబల్ ఇండియా ప్రైమ్ కబడ్డీ లీగ్‌కు రెడ్డిప్రసాద్ ఎంపిక


గంపా రెడ్డిప్రసాద్

రామాపురం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీ బీసీ కాలనీకి చెందిన గంపా నాగేంద్ర కుమారుడు గంపా రెడ్డిప్రసాద్ గ్లోబల్ ఇండియా ప్రైమ్ కబడ్డీ లీగ్‌కు ఎంపికయ్యారు. ఈ నెలలో హైదరాబాదులో నిర్వహించిన కబడ్డీ సెలెక్షన్‌లో గంపా రెడ్డిప్రసాద్ తనదైన శైలిలో ప్రతిభను కనబర్చడంతో ఈ గ్లోబల్ ఇండియా ప్రైమ్ కబడ్డీ లీగ్‌కు ఎంపిక చేశారు. గతంలో జమ్మూ కశ్మీర్‌లో నిర్వహించిన జాతీయ కబడ్డీ పోటీల్లో 2024లో ఆంధ్రప్రదేశ్ తరఫున గోల్డ్ మెడల్ సాధించారు. ఈ కబడ్డీని హర్యానా రాష్ట్రంలో ప్రపంచ దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులతో నిర్వహించారు. అందులో తమ మండలానికి చెందిన తన బిడ్డ పాల్గొనడం ఆనందంగా ఉందని గంపా రెడ్డిప్రసాద్ తండ్రి నాగేంద్ర తెలిపారు. అంతేగాకుండా గ్రామ ప్రజలు, మండల ప్రజలు ఈ ఎంపిక పట్ల హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో జాతీయ జట్టుకు ఎంపిక కావాలని మండల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. సూచిక బోర్డు ధ్వంసం!

నిమ్మనపల్లి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బాహుదా ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను తెలిపే సూచిక బోర్డు ఓ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ధ్వంసమైంది. మండలంలోని ముష్టూరు పంచాయతీలో 1974లో రూ.63 లక్షలతో బాహుదా ప్రాజెక్టును నిర్మించారు. రెండు నెలల క్రితం ప్రాజెక్టు వద్ద జనరేటర్ అమర్చేందుకు రూ.9.5 లక్షలతో భవన నిర్మాణం ప్రారంభించారు. ఈ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ శ్రీనివాసులురెడ్డి ప్రాజెక్టు ముందు ఏర్పాటు చేసిన సూచిక బోర్డును ఎక్స్‌కవేటర్‌తో తొలగించి పక్కన పడవేశాడు. బోర్డును తొలగించి రెండు నెలలు కావస్తున్నా, దానిని పట్టించుకున్న పాపాన పోలేదు. దీనిపై సంబంధిత ఇరిగేషన్ ఏఈ శ్రీహరిరెడ్డి వివరణ కోరగా కొత్త సూచిక బోర్డును ఏర్పాటు చేస్తామని తెలిపారు. అయితే కాంట్రాక్టర్ శ్రీనివాసులురెడ్డి నిర్లక్ష్యం కాదని, కావాలనే సూచిక బోర్డు అని తెలిసినా తొలగించి పక్కన పడవేయడమేంటని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటి కైనా బోర్డును పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.



ధ్వంసమైన బోర్డు



అకాల వర్షంతో.. నేలవాలిన పైరు

బి.కొత్తకోట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలోని గుమ్మసముద్రం, వడిగులవాండ్లపల్లె, అచ్చమ్మకోట తదితర గ్రామాలలో శుక్రవారం కురిసిన అకాల వర్షంతో అపార నష్టం కలిగినట్లు రైతులు తెలిపారు. రెండు రోజుల క్రితం కురిసిన గాలివానకు మొక్కజొన్న పైరు నేలమటమైంది. తన రెండెకరాల మొక్కజొన్న పంట కంకులు పాలుపట్టే దశలో నేలవాలిపోవడంతో పంటను పూర్తిగా నష్టపోయినట్టేనని రైతు సుధాకర్‌రెడ్డి తెలిపాడు. అదే గ్రామంలో రామలక్ష్మమ్మ అనే ఒంటరి మహిళ రేకులతో వేసిన పైకప్పు గాలితాకిడికి లేచిపోయింది. వర్షం ధాటికి దెబ్బతిన్న పంటలను, నివాస గృహాలను పరిశీలించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

కంకర తేలిన ఆర్టీసీ బస్టాండు ప్రాంగణం



ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో అధ్వానంగా రోడ్డు

కలకడ, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కలకడ ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో బస్సులు నిలిపే ప్రాంతంలో సీసీ ప్లాట్‌ఫాం లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం మట్టి వర్షానికి కొట్టుకుపోవడంతో కంకర రాళ్లు బయట పడ్డాయి. దీంతో వృద్ధులు, దివ్యాంగులు, చిన్న పిల్లలు బస్సులెక్కే సమయంలో ఇబ్బంది పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించాల్సి ఉంది.

ఉచితంగా స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ కోరారు. శుక్రవారం స్థానిక కళాశాలలో ఏబీవీపీ నాయకులు సాయిహితేష్, మోహన్‌రాజ్, సాయిప్రకాష్ ఆధ్వర్యంలో ఉచిత తరగతులపై కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ మే నెల 1వ తేదీ నుంచి మదనపల్లెలో స్పోకెన్ ఇంగ్లీష్ ఉచిత తరగతులు నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 83742 74202 నెంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

కోర్టులో గంగమ్మకు పూజలు



ప్రత్యేకాలంకరణలో కోర్టులో గంగమ్మ

మదనపల్లె అర్బన్: ఏప్రిల్ 18 (ఆంధ్ర జ్యోతి): స్థానిక బెంగళూరు రోడ్డులోని కోర్టు అవరణలో వెలసిన గంగమ్మకు శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ ప్రధాన అర్చకుడు పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. రాహుకాల సమయంలో మహిళలు పొంగళ్లు సమర్పించారు. నిమ్మకాయలపై నెయ్యి వత్తులతో దీపారాధన చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు మార్వారి చిన్నరెడ్డెప్ప, కార్యదర్శి మార్వారి ప్రభాకర్‌నాయుడు, ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు, ట్రెజరర్లు కరుణాకర్ నాయుడు, రాట కొండ రంగస్వామినాయుడు, దేవేంద్ర, మార్వారి విక్కీ, మార్వారి మహేష్, శ్రీనివాసులు నాయుడు పర్యవేక్షించారు.

వైభవంగా పాలేటి గంగమ్మ తిరునాళ్లు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కురబలకోట, ఏప్రిల్ 18(ఆంధ్ర జ్యోతి): మండలం లోని తెట్టు సమీపంలో శుక్రవారం పాలేటి గంగమ్మ తిరునాళ నిర్వహించారు. పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ చైర్మెన్ ఆంజినేయులు, సిబ్బంది ఏర్పాట్లు చేశారు. తెట్టు నులక మనోహర్‌రెడ్డి దంపతులు అమ్మవారి కి చీర సమర్పించారు. విద్యుత్ దీపాలతో అలంకరించిన చాందినీ బండ్లను ఊరేగించారు. ముదివేడు పోలీసులు బందోబస్తు నిర్వహిం చారు.

పరోపకారమే పరమావధి కావాలి



పీలేరులోని సౌత్ ఆంధ్రా లూథరన్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



కలకడలో..



కురుబలకోటలో..

కురబలకోట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పరోపకారమే పరమావధిగా జీవితాన్ని కొనసాగించాలని పాస్టర్ ప్రకాశం తెలిపారు. శుక్రవారం మండలంలోని అంగళ్లు సియోను ప్రార్థనా మందిరం, తెట్టు, కామూరివాండ్లపల్లె, ఆరోగ్యపురం తదితర చోట్ల చర్చిలలో గుడ్ ఫ్రైడే సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వార్థం, అహం, హింసను విడిచి సన్మార్గంలో పయనించాలన్నారు. ఎదుటి వారికి సహాయపడడంతో పాటు శాంతి, సహనం, సౌశీల్యం తదితర సుగుణాలను అలవర్చుకోవాలన్నారు. అనంతరం ప్రపంచ శాంతి కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చర్చిలను విద్యుత్‌దీపాలతో ప్రత్యేకంగా ముస్తాబు చేశారు.

కలకడ : మండలంలో గుడ్ ఫ్రైడే పర్వదినాన్ని శుక్రవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా కోన గంగిరెడ్డిగారిపల్లెలోని యిబ్రోన్‌ప్రార్థన మందిరం, కే.కొత్తపల్లె చర్చి, కలకడ షపర్డ్ చర్చిలో పాస్టర్‌లు విజయశేఖర్, సుబాష్‌ల ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉపవాస దీక్ష చేశారు. అనంతరం ఆరాధన కార్యక్రమం నిర్వహించి అన్నదానం చేశారు.

పీలేరు : మానవాళి ప్రశాంత జీవించాలంటే ఏసుక్రీస్తు బోధించిన మార్గమే ఆచరణీయమని పీలేరులోని సౌత్ ఆంధ్రా లూథరన్ చర్చి పాస్టర్ సుందర్‌రావు తెలిపారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం చర్చిలో ఆయన ధార్మికోపన్యాసం చేశారు. ఏసుక్రీస్తును శిలువ వేసిన కారణాలను స్మరించుకున్నారు. . గుడ్ ఫ్రైడే సందర్భంగా మండలంలోని క్రైస్తవులు శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తమ ప్రాంతాల్లోని చర్చులు, ప్రార్థనా మందిరాలలో ప్రార్థనలు చేశారు

తంబళ్లపల్లె: ఉదయం నుంచే చర్చిల్లో ప్రార్థనలు చేశారు. ఉపవాస దీక్ష పాటించారు.

వర్గీకరణ ఆర్డినెన్స్‌పై ఎంఆర్‌పీఎస్ సంబరాలు



నేతల ఫ్లెక్సీని పాలతో అభిషేకిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

పీలేరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడంతో శుక్రవారం పీలేరులోని ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, టీడీపీ నేతలు సంబరాలు చేసుకున్నారు. స్థానిక పంచాయతీ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెద్దఎత్తున కేక్‌లు కట్ చేసి పంచి పెట్టారు. పంచాయతీ కూడలి, నాలుగు రోడ్ల కూడలిలో బాణసంచా కాల్చారు. ఎంఎస్‌పీ నేత ఎన్.సుధాకర్ బాబు అంబేడ్కర్ విగ్రహం ఎదుట తలనీలాలు సమర్పించారు. ఎస్సీ వర్గీకరణకు పోరాడినందుకు మందకృష్ణ మాదిగ, సహకరించినందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్రంలో ఆర్డినెన్స్ తెచ్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు అభిషేకం చేశారు. వర్గీకరణ కారణంగా అనాదిగా వెనుకబడిపోయిన మాదిగల జీవితాల్లో ఇకపై కొత్త వెలుగులు ప్రసరిస్తాయని ధైర్యం వ్యక్తం చేశారు. సంబరాలకు టీడీపీ నేతలు మద్దతు పలికారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో పీలేరు ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుడ్డ రామకృష్ణ మాదిగ, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షులు జయన్న, పీలేరు నియోజకవర్గ ఎంఆర్‌పీఎస్ ఇన్‌ఛార్జ్ గండికోట వెంకటేశ్, విద్యావేత్త డా.రఘునాథ్, రామనాథ్, ఎంఆర్‌పీఎస్ నాయకులు మాటూరి మురళీ, ముల్లంగి చంద్రయ్య, మల్లికార్జున, అశోక్, నాగేశ్వర, రెడ్డయ్య, మంద గురుప్రసాద్, రాజేంద్ర, ఇ.ప్రసాద్, రెడ్డి ఆంజనేయులు, తిమ్మయ్య, కుమార్, మునిరాజ, సుబ్బరాజు, ఎంఎస్‌ఎఫ్ నాయకులు సద్దల శ్రీకాంత్, ఓబులేశు, గిరిబాబు, నరేశ్, ఎంఈఎఫ్ నాయకులు రమణయ్య, కృష్ణయ్య, వెంకటరమణ, వెంకటాచలపతి, శ్రీనివాసులు, రమణ, మహేశ్, రాజేశ్, గురుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ములకలచెరువు: ములకలచెరువులో శుక్రవారం ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ప్రతాప్‌కుమార్, ఇన్‌చార్జి తిరుపాల్ విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతో మాదిగల ఆకాంక్ష నెరవేరిందన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలుకు కృషి చేసిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు కృష్ణప్ప, గౌరవాధ్యక్షుడు శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, నాయకులు తీపు రమణ, పారేసు, బయన్న, ఆది, రమణప్ప, రవి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



వాల్మీకిపురంలోని పెట్రోల్ బంక్‌లో ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



పీలేరులోని పెట్రోల్ బంక్ వద్ద అగ్నిప్రమాదాలపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది

పీలేరు రూరల్ 18 (ఆంధ్రజ్యోతి): అనుకోకుండా సంభవించే అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని పీలేరు అగ్నిమాపక అధికారి ఎస్. మస్తాన్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో బాగంగా పీలేరు పట్టణంలోని దుర్గా, జగదీశ్వరీ గ్యాస్ ఏజన్సీలు, పెట్రోల్ బంక్‌ల వద్ద అగ్ని ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మంటలు చెలరేగినపుడు అవి ఇతర ప్రాంతాలకు విస్తరించకుండా అదుపు చేయడం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. వారోత్సవాల్లో బాగంగా కరపత్రాలు వాహన చోదకులు, గ్యాస్ ఏజెన్సీలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది నాగిరెడ్డి, హేమాద్రిరెడ్డి, చలపతి, కృష్ణమూర్తి, శ్రీనివాసులు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌ఫైర్ పట్ల తస్మాత్‌జాగ్రత్త

వాల్మీకిపురం : ఆయిల్ ఫైర్‌పై అప్రమత్తంగా ఉండాలని వాల్మీకిపురం అగ్నిమాపక కేంద్ర అధికారి బాబయ్య తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో బాగంగా శుక్రవారం స్థానిక తరిగొండ రోడ్డులోని పెట్రోల్ బంక్‌లో డెమో ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయిల్ ఫైర్, అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు అప్రమత్తంగా ఉంటూ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదంలో చిక్కుకున్న వారిని ఏ విధంగా రక్షించాలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్ కిరణ్‌కుమార్, శ్రీనివాసులు, ఆపరేటర్లు రాజగోపాల్ నాయక్, మురళి, మోహన్‌నాయక్, కిరణ్‌బాబు, ఫైర్‌మెన్‌లు వెంకటరమణ, రవి, ఇమ్రాన్‌బాషా, బలరాంనాయక్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దండుమారెమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో మారెమ్మ

తంబళ్లపల్లె, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నెమడుగులో శుక్రవారం కన్నె వడుగు, ఎద్దుల వారి పల్లె, మర్రిమాకులపల్లె వాసులు దండు మారెమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి శంకర్‌రెడ్డి అమ్మవారిని పూలతో అలంకరించి పూజలు చేశారు. మహిళలు సామూహికంగా కాలినడకన వెళ్లి అమ్మవారికి దీలూ, బోనాలూ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం భక్తులు చాందిని బండ్లు కట్టి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు

12 లీటర్ల నాటుసారా స్వాధీనం - ఒకరి అరెస్టు



పట్టుబడిన నాటుసారా, బెల్లంతోపాటు నిందితుడిని చూపుతున్న జిల్లా ఎక్సైజ్ పోలీసులు

పెద్దమండ్యం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) మండలంలోని ముసలికుంట గ్రామ పంచాయతీ దామ్లానాయక్ తాండాలో శుక్రవారం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. మండ లంలోని ముసలికుంట గ్రామ పంచాయతీ దామ్లానాయక్ తాండాలో 12 లీటర్ల నాటుసారా, బెల్లంను స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్టు చేసినట్లు ములకల చెరువు ఎక్సైజ్ సీఐ మాధవి తెలిపారు. ఎక్సైజ్ ఎస్ఐ వెంకటేష్, సిబ్బంది తదిత రులు పాల్గొ న్నారు.

పిడుగుపాటుకు పాడి ఆవు మృతి



పిడుగుపాటుకు మృతి చెందిన పాడిఆవు

కలకడ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎనుగొండపాలెం పంచాయతీ ఒంటిల్లులో శుక్రవారం పిడుగుపాటుకు పాడి ఆవు మృతి చెందింది. గ్రామానికి చెందిన వై.వెంకటేశ్వరనాయుడు పశుపోషణతో జీవనం సాగిస్తున్నాడు. ఇంటికి సమీపంలోని ఓ చెట్టుకింద ఆవులకు మేత వేసి కట్టేశాడు. ఆ ప్రాంతంలో పిడుగుపడడంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. విపత్తుతో రూ.60 వేలు నష్టం జరిగిందని బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం దయతలచి ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ములకలచెరువు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంబై - చెన్నై జాతీయ రహదారి విస్తరణలో భాగంగా శనివారం కొత్తలైన్ల ఏర్పాటు, మెయింటెనెన్స్ కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏడీ గోవిందురెడ్డి, ఏఈ రామలక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా బురకాయలకోట 132 కేవీ సబ్ స్టేషన్‌లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ములకలచెరువు, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కేఎస్‌ఆర్‌ఎం ట్రోఫీలో మిట్స్ విద్యార్థుల ప్రతిభ

కురబలకోట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్స్ కు చెందిన విద్యార్థులు కడప కేఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన క్రీడా పోటీలలో ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ సి.యువరాజ్ తెలిపారు. ఽ మహిళల విభాగంలో త్రోబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, టెన్నికాయిట్, పురుషుల విభాగంలో బాల్ బ్యాడ్మింటన్‌లో విన్నర్స్‌గా నిలిచారు.

ఫారెస్టు బీట్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఉచ్చులో చిరుతపులి చిక్కుకుని ప్రాణాలు విడిచిన సంఘటనపై ఆ ప్రాంత ఫారెస్టు బీట్ అధికారులపై చర్యలు తీసుకోవాలని, అమాయకులైన రైతులపై కేసులు వాపసు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అటవీ సంరక్షణ కోసం పని చేస్తున్న బీట్ ఆఫీసర్ ఉచ్చులు తొలగించడానికి ఎందుకు ప్రయత్నించలేదని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ఫారెస్టు ఆఫీసర్‌పై ఉన్నత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ సంఘటనపై జిల్లా అధికారులు సమగ్ర విచారణ చేసి రైతులకు న్యాయం చేయాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పంచాయతీ కార్మికుల కార్యవర్గం ఏకగ్రీవం



కార్యవర్గం వివరాలు ఈవోకు అందజేస్తున్న కార్మికులు

పీలేరు రూరల్ 18 (ఆంధ్రజ్యోతి): పీలేరు గ్రామ పంచాయతీ కార్మికుల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘ గౌరవాధ్యక్షుడు డీ. వెంకట్రామయ్య తెలిపారు. శుక్రవారం పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికుల సమావేశం ఏర్పాటు చేసి నూతన కమిటీని ఎన్నుకున్న ట్లు చెప్పారు. అ.ధ్యక్షుడిగా బి. వి. రమణ, ప్రధాన కార్యదర్శిగా ఓబులేశ్, కోశాధికారిగా బీ. నాగార్జున మరో 11 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఆర్టీఐ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా వెంకటరెడ్డి

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో వజ్రాయుధం లాంటిదని సమాచార హక్కు చట్టం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన పి.వి వెంకటరెడ్డి తెలిపారు. రెండు రోజుల క్రితం అన్నమయ్య జిల్లా రాయచోటిలో జరిగిన సమాచార హక్కు చట్టం జిల్లా నూతన కార్యవర్గాన్ని నియమించారు. అన్నమయ్య జిల్లా సమాచార హక్కు చట్టం జిల్లా అధ్యక్షుడిగా పెద్దతిప్పసముద్రం మండలంలోని టి.సదుం పంచాయతీ రామాపురానికి చెందిన పి.వి. వెంకటరెడ్డి , పెద్దతిప్పసముద్రం మండల అధ్యక్షుడిగా కాట్నగల్లు పంచాయతీకి చెందిన గువ్వల హరీష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టంపై మండలంలోని ప్రతి గ్రామంలో అవగాహన సదస్సులు నిర్వహించి అవగాహన కల్పిస్తామన్నారు. మండల స్థాయి అధికారులు సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని, అలా జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

నంద కుమార్‌కు ఉపాధ్యాయుల నివాళి



నంద కుమార్‌కు నివాళులు అర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు

పీలేరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఇటీవల నీట మునిగి మరణించిన తమ సహచరుడు నంద కుమార్‌కు శుక్రవారం పీలేరులోని ఎస్టీయూ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. నంద కుమార్ తన జీవితాంతం సృజనాత్మకతకు, మానవీయ విలువలకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచాడని పలువురు నాయకులు గుర్తు చేసుకున్నారు. ఆయన వ్యక్తిత్వం, సేవా కార్యక్రమాల ద్వారా ఆయన ప్రతి ఒక్కరి మదిలో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. అనంతరం ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. స్థానిక కోటపల్లె జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో పీలేరు మండల ఎస్టీయూ శాఖ నాయకులు, సభ్యులు, నందకుమార్ కుటుంబసభ్యులు, స్నేహితులు పాల్గొన్నారు.


ఉర్దూ భాషకు పుట్టినిల్లు భారతదేశమే..

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 18: ఉర్దూ భాషకు భారతదేశం పుట్టినిల్లు అని దీనిపై దురభిప్రాయం తగదని సుప్రీంకోర్టు అభిప్రాయపడటంపై శుక్రవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కేబాషా తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ మహారాష్ట్రలో సైన్ బోర్డులపై ఉర్దూ బాషలో రాయడంపై సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిందన్నారు. భారతదేశ వ్యాప్తంగా కుల, మతాలకు అతీతంగా వినియోగంలో ఉందని గుర్తుచేశారు. దేశంలో ఇతర బాషలతోపాటు ఉర్దూకు విడదీయరాని సంబంధం ఉందన్నారు. దీనిపై ఎవరికీ అపోహలు వద్దన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉర్దూబాష రెండో అధికార భాషగా కొనసాగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉర్దూ భాషను గౌరవిస్తూ విద్యా బోధనలో మరింత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. 2025 విద్యా సంవత్సరంలో ఉర్దూ పాఠశాలలు, కళాశాలలు మౌలిక వసతులు ఏర్పాటు చేసి ఉపాధ్యాయులను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల బోర్డులపై, రహదారుల్లో ఏర్పాటు చేసిన బోర్డులపై ఉర్దూ భాషతో పేర్లు రాసి గుర్తింపు ఇవ్వాలని కోరారు.

నాటుసారాతో జీవితాలు నాశనం చేసుకోవద్దు

పెద్దమండ్యం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) నాటుసారాతో జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ పిలుపునిచ్చారు. మండలంలోని ముసలికుంట గ్రామ పంచాయతీ దామ్లానాయక్ తండాలో శుక్రవారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ దురలవాట్ల నుంచి బయటపడి పిల్లల ఉన్నత విద్య కోసం తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. నాటుసారా రహిత గ్రామాలను తీర్చిద్దిడానికి సమిష్టిగా కృషి చేయాలని గిరిజనతాండా వాసులను కోరారు. . ములకలచెరువు ఎక్సైజ్ సీఐ మాధవి, ఎస్ఐ వెంకటేష్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఫ్రైడే డ్రైడే పాటిస్తే వ్యాధులు దూరం



ఫ్రైడేడ్రైడేపై గ్రామాలలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

వాల్మీకిపురం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఫ్రైడే డ్రైడేగా పాటించడం ద్వారా వ్యాదులను దూరం చేయవచ్చునని వాల్మీకిపురం మండలం చింతపర్తి పీహెచ్ఎ డాక్టర్ జులేఖాబేగం తెలిపారు. మండలంలోని చింతపర్తిలో శుక్రవారం దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాదులపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్య చికిత్సలపై అవగాహన కల్పించారు. వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల హెల్త్ ఎడ్యుకేటర్ మహ్మద్‌రఫి, సూపర్‌వైజర్ సుధాకర్, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారుడిపై కేసు నమోదు

నిమ్మనపల్లి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): అతివేగంగా వాహనాన్ని నడిపి ఒక వ్యక్తిని గాయపరచడమే కాకుండా, ద్విచక్రవాహనం దగ్ధానికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలి పారు. గురువారం సాయత్రం ముష్టూరు పంచాయతీ చల్లావారిపల్లి వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో రామసముద్రం మండలం చెంబకూరు పంచాయతీ గజ్జలవారిపల్లి చెందిన హరీష్‌కుమార్ రెడ్డికి తీవ్ర గాయాలు కాగా, అతని ద్విచక్రవాహనం పూర్తిగా దగ్ధమైంది. బాధితుడి అన్న రఘునాథ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు మదనపల్లి మండలం కొత్త ఇండ్లకు చెందిన గురువంశీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.